గణనాథుడికి గరికపూజ



కరప మండలం కొంగోడులో గణనాథుడికి గరికపూజ

బార్లకు 14 వరకు దరఖాస్తుల స్వీకరణ

» జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మిగిలిన 12 బార్లను కేటాయించడానికి ఈనెల 14న సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలు, ప్రాసెసింగ్‌ఫీజు రూ.10వేలు చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ చేయాలన్నారు. తొలివిడతలో ఐదు బార్లను లాటరీ పద్ధతిలో అభ్యర్థులకు కేటాయించామన్నారు. రెండో విడత దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తర్వాత వీటిని లాటరీ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పంచాయతీలకు రూ.24.48కోట్లు..
15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 385 గ్రామ పంచాయతీలకుగాను ఎన్నికలు జరిగిన 375 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 2024-25వ సంవత్సరానికి సంబంధించి 2వవిడత బేసిక్ నిధులు రూ.9.79కోట్లు, టైడ్ నిధులు రూ.14,68,51,224 కలిపి మొత్తం రూ.24,47,52,227 నిధులకు సంబంధిత గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వుల మేరకు నిధులు ఆయా గ్రామ పంచాయతీల 15వ ఆర్థిక సంఘం బ్యాంకు ఖాతాకు నేరుగా బుధవారం జమయ్యాయని నిధులను నిర్దేశిత మార్గదర్శకాల మేరకు లోబడి ఖర్చు చేయాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ తెలిపారు.

7న జరిగే ఫారెస్ట్ రిక్రూట్మెంట్ పరీక్షలకు
ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల7న జిల్లాలో జరిగే ఫారెస్ట్ సర్వీస్‌రిక్రూట్మెంట్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల పరీక్షలను జిల్లాలో 26 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నిర్వహించే పరీక్షలకు 15,447మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, మధ్యాహ్నం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ల పరీక్షకు 2283మంది హాజరవుతున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలవద్ద సెక్షన్ 144 అమలు చేయాలన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాలకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు.

ఏలేరు ప్రాజెక్టునుంచి దర్జాగా నీళ్లు వాడుకుంటూ విద్యుదుత్పత్తి

» ఆ కరెంటు జెన్‌కోకు విక్రయించి ఏటా రూ.కోట్లలో సంపాదన
» కానీ ఆరేళ్లుగా నీటి వాడకం బిల్లులు ఎగవేత
» రూ.2.03 కోట్లు బకాయిలు కట్టని వైనం
» బాకీలున్నా మళ్లీ ఒప్పందం పొడిగించిన వైసీపీ ప్రభుత్వం
» కూటమి వచ్చాక మూడు సార్లు నోటీసులు
» స్పందించని కంపెనీ యాజమాన్యం
» అయినా నీటి సరఫరా కొనసాగిస్తున్న అధికారులు
» సెప్టెంబరు 10 వరకు చివరి చాన్స్ ఇచ్చామన్న ఏలేరు ఈఈ
» ఆ తర్వాత చెల్లించకుంటే నీటిసరఫరా ఆపేస్తామని వెల్లడి

'మణిహంస'పై మోజేంటో!

పవర్ ప్లాంట్‌పై అధికారులకు ఎంత ప్రేమో!!



మణిహంస పవర్ ప్లాంట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో మణిహంస జల విద్యుత్ ప్లాంట్‌పై జలవనరుల శాఖ అధికారులు అంతులేని ప్రేమ చూపిస్తున్నారు. ఏళ్ల తరబడి నీటి చార్జీలు చెల్లించకపోయినా ప్లాంట్ యాజమాన్యానికి యథాశక్తి సహకరిస్తున్నారు. రూ.2 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉందంటూ మూడు సార్లు పంపిన నోటీసులకు స్పందించకపోయినా ప్లాంట్‌కు నీటిసరఫరా కొనసాగిస్తున్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పరిధిలోని ఏలేరు రిజర్వాయరును ఆనుకుని ఈ మణిహంస జలవిద్యుత్ కేంద్రం ఉంది. 4.5 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి చేస్తున్న ఈ కంపెనీ రోజూ 600 నుంచి 900 క్యుసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి వాడుకుంటోంది. తద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఏపీ జెన్‌కోకు విక్రయిస్తూ ఏటా రూ.కోట్లు సంపాదిస్తోంది. ఏలేరు ప్రాజెక్టు నుంచి వాడుకుంటున్నందుకు జలవనరుల శాఖకు నీటి చార్జీలు చెల్లించాల్సి ఉండగా.. 2019 నుంచి ఇంతవరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. ఈ ప్లాంట్ యజమాని వైసీపీ అధినేత జగన్ సామాజిక వర్గానికి చెందినవారు. కోనసీమ జిల్లాలో వైసీపీ సానుభూతిపరుడిగా కూడా ఉన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దర్జాగా నీటి బకాయిలు ఎగవేస్తూ వస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా నీటి బాకీల గురించి సదరు కంపెనీకి నోటీసు ఇవ్వలేదు. ఈ కంపెనీ జలవనరుల శాఖతో గతంలో కుదుర్చుకున్న ఏలేరు నీటి సరఫరా కాంట్రాక్టు గడువు 2023లోనే ముగిసిపోయింది. బకాయిలు చెల్లించాక గానీ మళ్లీ ఒప్పందం కుదుర్చుకోకూడదు. అప్పటికి మణిహంస పవర్ ప్లాంట్ ప్రభుత్వానికి రూ.2 కోట్ల మేర నీటి బకాయిలు చెల్లించాల్సి ఉంది. కొత్త ఒప్పందం కుదుర్చుకునే ముందు పాత బకాయిలన్నీ చెల్లిస్తేనే అధికారులు ముందుకు వెళ్లాలి. కానీ అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో అధికారులు ఆ బకాయిల జోలికే వెళ్లలేదు. సరికదా తిరిగి అదే కంపెనీతో కొత్తగా నీటి సరఫరా కాంట్రాక్టును కుదుర్చుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా సదరు కంపెనీ పద్ధతి మారలేదు. నీటి బకాయిలు చెల్లించలేదు. దీంతో గత ఏడాది ఆఖర్లో అధికారులు కంపెనీని సంప్రదించారు. 2024 డిసెంబరు నాటికి పేరుకుపోయిన నీటి బకాయిలు రూ.2.03 కోట్లు చెల్లించాలని కోరగా.. కంపెనీ అంగీకరించింది. కానీ నయాపైసా కట్టలేదు. దీంతో ఈ ఏడాది జనవరి 31న ఇంకో నోటీసు జారీ చేశారు. తర్వాత ఏప్రిల్, జూలైలోను నోటీసులిచ్చారు. అయినా కంపెనీ స్పందించలేదు. మూడుసార్లు నోటీసు వ్యవధి పూర్తయిన నేపథ్యంలో తక్షణం నీటి సరఫరాను సదరు కంపెనీకి నిలిపివేయాల్సి ఉండగా అధికారులు మళ్లీ సెప్టెంబరు 10 వరకు ఇంకోసారి గడువు పొడిగించి యథావిధిగా నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. దీనిపై ఏలేరు ప్రాజెక్టు ఇన్‌చార్జి ఈఈ స్పందిస్తూ.. మణిహంస ప్రాజెక్టుకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా నీటి బకాయిలు చెల్లించడం లేదని, అందుకే సెప్టెంబరు 10 వరకు చివరి అవకాశం ఇచ్చామని తెలిపారు. ఆ తర్వాత కూడా చెల్లించకపోతే నీటి సరఫరా నిలిపివేస్తామని నోటీసుల్లో హెచ్చరించినట్లు వెల్లడించారు.

ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులు సిద్ధం

» యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు
» జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌పంటలకు కావాల్సిన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒకప్రకటన ఆయన వెలువరించారు. జిల్లాలో ఎరువుల సరఫరాపై నిరంతరం నిఘా ఉంచామన్నారు.రైతులకు ఎవరికైనా ఎరువుల సమస్య వస్తే 83310 56509 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. యూరియా ఇప్పటివరకు 18,061మెట్రిక్ టన్నులు అవసరంకాగా 18,863 మెట్రిక్ టన్నులు జిల్లాకు సరఫరాచేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో 2140 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉందన్నారు. వరిపంటకు ఎకరానికి 15కిలోల చొప్పున మూడుసార్లు చల్లాలన్నారు. యూరియా అధికంగా వాడడంవల్ల భూమి ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఈనెల 6న 1800 మెట్రిక్‌టన్నుల యూరియా జిల్లాకు సరఫరా చేస్తారన్నారు. ఎవరైనా అనధికారికంగా యూరియాను బ్లాక్ మార్కెటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రబీ సీజన్‌కు కావాల్సిన ఎరువులను నిల్వ చేస్తున్నామన్నారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన విజయవంతం

» జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం విజయవంతమైందని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా రైతులకు ఇచ్చిన బ్రోమో డయాలిన్ మందును సమర్థంగా వినియోగించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతు సేవా కేంద్రాల్లో దీనిపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఎలుకల నిర్మూలన కార్యక్రమం జరిగిందన్నారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

» 8 నెలలుగా తగ్గింపు అమలు
» తాజాగా రూ.50.50 తగ్గింపు
» వ్యాపారఅవసరాలకు లబ్ధి
» తగ్గని గృహావసర సిలిండర్ ధర



సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : వాణిజ్యవసరాలకు వినియోగించే 19 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు రూ.51 తగ్గిస్తూ చమురు మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయం తీసుకోవడమే గాక సెప్టెంబరు 1 సోమవారం నుంచి అమలుచేస్తుంది. దీంతో పలు హోటళ్ళు, రెస్టారెంట్లు, తదితర వ్యాపార సముదాయాలు నిర్వహించే వారికి ఉపశమనం కలిగింది. అయితే గృహావసర గ్యాస్ సిలిండర్ల ధరలు మాత్రం యధావిధిగా వసూలు చేసేలా నిర్ణయించారు. ఈ ఏడాది ఒక్క మార్చి నెల మినహా మిగిలిన ఎనిమిది నెలలూ 19 కిలోల వాణిజ్యవసర గ్యాస్ సిలిండర్ల ధరలు ఈ ఏడాది జనవరి 1 నుంచి నిరంతరం తగ్గుతున్నాయి. జనవరి 1న దీనిని రూ.14.50 పైసలు తగ్గించగా.. ఫిబ్రవరిలో రూ. 7 తగ్గించారు. మార్చి నెలలో వీటి ధరలు రూ. 6 పెరిగినా ఏప్రిల్ నెలలో రూ.41 వరకూ తగ్గించారు. మే 1న రూ.14, జూన్ 1న రూ. 24 చొప్పున తగ్గించారు. జూలై 1న వీటి ధరలను రూ.58.50పైసలు చొప్పున తగ్గించారు. దీని తర్వాత ఆగస్టు1న మళ్లీ రూ. 33.50పైసలు తగ్గించారు. ఇప్పుడు తాజాగా సెప్టెంబరు 1 సోమవారం నుంచి రూ.51లు తగ్గించారు. ప్రస్తుతం 19 కిలోల వాణిజ్యవసర గ్యాస్ సిలిండర్ ధర రూ.1800గా ఉంది. అదే గృహావసర ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 905గా ఉంది. గత ఏప్రిల్ నెలలో గృహావసర గ్యాస్ సిలిండర్ల ధరలు రూ.50 చొప్పున పెరిగినప్పటి నుంచీ వాటి ధరలు పెరగలేదు, తగ్గాలేదు.

ధరలు ఎలా పెరుగుతాయి..

ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండి యన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్ పీసీఎల్)లు బెంచ్‌మార్క్, ఇంటర్‌నేషనల్ ఫ్యూయల్, ఫారిన్ ఎక్స్ఛేంజ్ రేట్ ఆధారంగా ప్రతి నెలా వంట గ్యాస్ ధరలు, ఏటీఎఫ్ ధరలను సవరిస్తూ ఉంటాయి.

సీఎం ఆదేశించినా..

» 'వాట్సప్ గవర్నెన్స్'పై ప్రజలకు అవగాహన కరువు
» పౌరసేవలు అందించడంలో అధికారులు విఫలం
» నీరుకారుతున్న ప్రభుత్వ లక్ష్యం
» పెద్దాపురం ప్రజావేదిక సభలో కమిషనర్‌ను హెచ్చరించిన సీఎం
» నేటికీ అవగాహన కల్పించని వైనం

పెద్దాపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రజల సమస్యలను నేరుగా తెలియజేయడానికి రూపొందించిన వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన లోపం తీవ్రంగా కనిపిస్తోంది. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సేవలను వాట్సప్ ద్వారా అందిస్తోంది. ప్రజలు దీన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన పెంచాలని ప్రభుత్వం చెప్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు తమ పనులకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండ కూడదన్న ఉద్దేశ్యంతో వాట్సప్ గవర్నెన్స్ (మనమిత్ర) విధానాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చింది. అధికారుల దీన్ని నిర్లక్ష్యం చేయడంతో ప్రభుత్వం లక్ష్యం నీరుకారిపోతోంది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సమస్యలు, ఫిర్యాదులు, సూచనలు చేరవేయాలనే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఈ సదుపాయం గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం చూస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



ప్రజావేదికలో మున్సిపల్ కమిషనర్‌ను హెచ్చరిస్తున్న సీఎం(ఫైల్)

మున్సిపల్ కమిషనర్‌కు సీఎం క్లాస్

పెద్దాపురంలో ఆగస్టు 23న సీఎం పర్యటనలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజాభిప్రాయాన్ని సీఎం చంద్రబాబు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అధికసంఖ్యలో ప్రజలు దీనిపై తమకు అవగాహన లేదని చెప్పడంతో సీఎం ఒకింత అసహనానికి లోనయ్యారు. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని తక్షణమే ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సమక్షంలో హెచ్చరించారు. అయినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇంటింటా ప్రచారం చేయడంతోపాటు ర్యాలీలు నిర్వహించి ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈవిధానంపై ప్రజలకు అవగాహన కరువైంది. మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలవారీగా దీనిపై అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అవగాహనలోపం కారణంగా అనేక సమస్యలు పరిష్కారం దిశగా వెళ్లకుండా నిలిచిపోతున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.

కిరాయి తగ్గించడంవల్ల నష్టపోయాం

» పరిశ్రమల యాజమాన్యం పునరాలోచించాలి
» రెండురోజుల్లో కలెక్టర్ వద్దకు కిరాయి పంచాయితీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఒప్పందాలవల్ల తాము తీవ్రంగా నష్టపోయామని కాకినాడ లారీ హోనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి మృత్యుంజయరావు, కార్యదర్శి అల్లంరాజు ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. అప్పట్లో జరిగిన ఒప్పందాల్లో పామాయిల్ పరిశ్రమల యాజమాన్యం తమకు మధ్య జరిగిన ఒప్పందాల్లో ఆంధ్ర నుంచి తెలంగాణకు వెళ్లే లారీల కిరాయిపై 12శాతం తగ్గించారన్నారు. ఇతర రాష్ట్రాలకు పామాయిల్ రవాణాచేసే వాటి కిరాయిపై 14శాతం రేటు తగ్గించారన్నారు. దీనివల్ల లారీల యాజమాన్యం ఆర్థికంగా కుదేలైందన్నారు. ఈ నేపథ్యంలో ఈఎంఐలు చెల్లించలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ తీర ప్రాంతంలో పామాయిల్ తయారీ పరిశ్రమలపై ఆధారపడి కాకినాడ పరిధిలో 1800 లారీల యాజమాన్యాలు ఉపాధి పొందుతున్నారన్నారు. ఏడునెలలుగా కిరాయిపై 12శాతం నుంచి 14శాతం వరకు డిస్కౌంట్ ఇవ్వడంవల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. రుణాలపై తీసుకున్న 500 వరకు లారీలను ఫైనాన్స్ సంస్థలు ఎత్తికెళ్లిపోయాయన్నారు. సకాలంలో ఈఎంఐలు చెల్లించకపోవడంవల్ల ఈ దుస్థితి నెలకొందన్నారు. ఆంధ్రనుంచి తెలంగాణ కిరాయిపై 6శాతం, ఇతర రాష్ట్రాలకు వెళ్లే లారీల కిరాయిపై 7శాతం పెంచాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రెండురోజుల్లో మరోసారి కలెక్టర్ షాన్‌మోహన్ వద్దకు ఈ కిరాయి పంచాయితీ వచ్చే అవకాశాలున్నాయి. అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిశ్రమల యాజమాన్యం, లారీఓనర్లు కలెక్టర్‌తో చర్చించనున్నారు. దీనిపై ఇప్పటికే అసోసియేషన్ ప్రతినిధులు ఒక నిర్ణయానికి వచ్చారు.

చోరీ అయిన కారు పట్టివేత

» 24 గంటల వ్యవధిలో ఛేదించి పట్టుకున్న ప్రత్తిపాడు పోలీసులు.. నిందితుడి అరెస్టు



చోరీకి గురైన కారు, నిందితుడితో ధర్మవరం పోలీసులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల1న ప్రత్తిపాడు మండలం ధర్మవరంక్షత్రియ రెస్టారెంట్‌వద్ద రాత్రి పూట చోరీ అయిన ఎర్టిగా కారును 24గంటల వ్యవధిలో ఆధారాలు సేకరించి నిందితుడితోపాటు కారును ప్రత్తిపాడు ఎస్‌ఐ లక్ష్మీకాంతం రికవరీ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ కోటంశెట్టి శివ అనే వ్యక్తి తన స్నేహితుడితో కలిసి ఎర్టిగా కారులో అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా తుని సమీపంలో జల్లి త్రినాథరావు అనే వ్యక్తి లిఫ్ట్ అడిగి వారితోపాటు కొంతదూరం ప్రయాణం చేశాడు. ప్రత్తిపాడుమండలం ధర్మవరం వరకు వచ్చి అక్కడ క్షత్రియ రెస్టారెంట్‌లో భోజనాలు చేసిన అనంతరం తాను డ్రైవింగ్ చేస్తానని, కారు తాళాలు తీసుకుని ఫిర్యాది అయిన కోటంశెట్టి శివ, అతని స్నేహితుడు ఇద్దరూ వాటర్‌బాటిల్ కొనుక్కోవడానికి షాప్ వద్దకు వెళ్లగా వారి కళ్లుకప్పి కారుతో నిందితుడు పరారయ్యాడని తెలిపారు. కారులో జీపీఎస్ ఆధారంగా ఎస్‌ఐ లక్ష్మీకాంతం చాకచక్యంగా నిందితుడిని వెంబడించి ప్రత్తిపాడు సంతోషిమాత ఆలయ సమీపంలో అతడిని, కారును రికవరీ చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఎస్‌ఐను ఉన్నతాధికారులు అభినందించారు.

సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

● ఏలూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలకు పదోన్నతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఐలుగా పనిచేస్తున్న వారిలో సీనియార్టీని బట్టి 8మందికి డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్‌నకు చెందిన పి.శ్రీనివాస్ ప్రస్తుతం రాజమహేంద్రవరం రైల్వే సీఐగా పనిచేస్తున్నారు. ఆయన 1996 ఎస్‌ఐ బ్యాచ్‌నకు చెందినవారు. డీఎస్పీగా పదోన్నతి కల్పించి రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్(మంగళగిరి)లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. 1995 ఎస్‌ఐ బ్యాచ్‌కు చెందిన పి.ఈశ్వరుడు కాకినాడ డీసీఆర్బీలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు డీఎస్పీగా పదోన్నతి కల్పించి పోలీస్‌హెడ్‌క్వార్టర్స్ రిపోర్టు చేయాలని ఆదేశించారు.

శానిటరీ సెక్రటరీ సస్పెన్షన్

» పెన్షన్ నిధులు దుర్వినియోగం చేయడంతో ఆదేశాలు జారీ చేసిన కాకినాడ కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ 32(బి) సచివాలయంలో శానిటరీ సెక్రటరీగా పనిచేస్తున్న ఎస్.వరహాలు సెప్టెంబరు నెల పెన్షన్‌కి సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారులు గుర్తించారు. 40మంది లబ్ధిదారుల నిధులను దారి మళ్లించి తన సొంత అవసరాలకు వాడుకోవడంతో శానిటరీ సెక్రటరీ వరహాలను సస్పెండ్ చేస్తూ కమిషనర్ భావన సోమవారం ఆదేశాలు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

భర్త మరణాన్ని తట్టుకోలేక బలవన్మరణం
కొడుకు చేతిలో తండ్రి హతం 7

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరించాలి

జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించాలని జేసీ రాహుల్ మీనా ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ సన్నద్ధతపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలశాఖ, మార్కెటింగ్, సహకార, ట్రాన్స్‌పోర్టు, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంఘం అధికారులు, రైస్ మిల్లర్లుతో కాకినాడ కలెక్టరేట్లో బుధవారం నిర్వహించారు.ధాన్యం సేకరణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఖరీఫ్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2389, సాధారణ రకం క్వింటాకు రూ.2369 ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ ప్రక్రియకు వినియోగించే వే బ్రిడ్జిలను లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేయాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా రైస్ మిల్లులను అనుసంధానం చేసి అవసరం మేరకు గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఈ-క్రాప్ బుకింగ్ 30 శాతం పూర్తి అయిందని ఈనెలాఖరుకు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు, వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్,ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లు తప్పనిసరిగా సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. రబీ సీజన్‌కు సంబంధించి ఇంకా 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లింగ్ చేసి పౌరసరఫరాల సంస్థకు పంపాల్సి ఉందన్నారు. 23 మంది సీఎంఆర్ మిల్లర్లు నుంచి ఈ బియ్యం డెలివరీ ఇవ్వాల్సి ఉందన్నారు. రైస్ మిల్లర్లు ఈ బియ్యాన్ని ఈనెల 10వ తేదీలోపు గోదాములకు చేరవేయాలన్నారు. బాయిల్డ్ బియ్యం ఎక్కువగా ఉన్న మూడు మిల్లుల నుంచి అధిక మొత్తంలో బియ్యం రావాల్సి ఉందన్నారు. 20 మిల్లుల నుంచి నిర్దేశించిన విధంగా రోజువారీ సీఎంఆర్ బియ్యాన్ని డెలివరీ చేయాలన్నారు.


ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా.. నగ్నంగా ఉన్న బాబా (ఫైల్)

హిందూ..ముస్లింల దేవుడు వలీబాబా

- మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న దర్గా
- నేటి నుంచి కొత్తలంకలో ఉరుసు ఉత్సవాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుల మత వైషమ్యాలకు అతీతంగా.. వర్గ విబేధాలకు దూరంగా అక్కడ హిందూ-ముస్లింలు ఒకే బాబాను ఆరాధిస్తారు. ముమ్మిడివరం మండలం కొత్తలంకలో వలీబాబా దర్గా వద్ద ప్రతీ ఏటా ఇదే రీతిలో ఉరుసు ఉత్సవాలు జరుగుతాయి. మౌనమే భాష, సేవే ధ్యానం, పరోపకారమే జీవిత పరమార్థాలుగా సర్వం త్యజించి నగ్న శరీరం తో ఉండే బాబా దివ్య సందేశాన్ని భక్తులకు అందించేవారు.నైజాం నవాబుల కాలం 1868లో నల్గొండ జిల్లా కొల్లేపల్లి గ్రామంలో బాబా జన్మించినట్టు అక్కడ ఉన్న ఆధారాలను బట్టి తెలుస్తుంది. 1918లో మూసీ నదికి వరద వచ్చినప్పుడు ఖాదర్‌వలీ బాబా ముమ్మిడివరం సమీపంలోని కొత్తలంక గ్రామానికి తొలిసారిగా వచ్చినట్టు స్థానికులు చెబుతారు. నగ్న శరీరంతో ఉండే ఈ బాబా నీళ్ల మీద నడక, మంచులో పడుకోవడం, వర్షంలో ఉన్నా తడవకపోవడం వంటి మహిమలు చూపేవారని చెబుతారు. బాబా పట్ల తొలిసారిగా కొత్తలంక గ్రామానికి చెందిన గేదెల వెంకటరత్నం ఆకర్షితులయ్యారు. ఆయనే బాబాకు సపర్యలు చేస్తుండేవారు. వెంకటరత్నం కుటుంబీకులే నేటికీ బాబాకు పూజలు చేస్తున్నారు. 1948 జూలై 28న బాబా తన దేహాన్ని త్యజించారు. అక్కడ నిర్మించిన సమాధే బాబా దర్గాగా పేరొందింది. నాటి నుంచి ప్రతీ ఏటా సమాధి వద్ద ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హిందూ-ముస్లింలు తరలివస్తుంటారు. వెంకటరత్నం సోదరులు ఏడాదికి ఒకరి వంతున సమాధి వద్ద పూజలు నిర్వహిస్తూ ఉత్సవాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఉరుసు ఉత్సవాలు గురువా రం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం చందల్ (గంధం) మహోత్సవం, మధ్యాహ్నం తెప్పోత్సవం, అదే రోజు సాయంత్రం ఫకీర్ల మేళతాళాలు, నౌబత్‌ఖానా, వాయిద్యాలు, బ్యాండు మేళాలలతో పొన్నూరివారి గుర్రపు నాట్యాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు నిర్వహిస్తారు. 5వ తేదీ శుక్రవారం దీపారాధన, 6 శనివారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గేదెల రఘునాధ్‌బాబా, ముజావర్ ఆధ్వర్యంలో ఉరుసు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఉచిత భోజన వసతి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులకు స్నానపు గదులు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఊరంతా.. మా..స్టార్లే!

పట్టుబట్టారు.. డీఎస్సీ సాధించారు



- శ్రీరంగపట్నంకు చెందిన 10 మంది ఎంపిక
- గ్రామంలో మొత్తంగా 25 మంది ఉపాధ్యాయులు


యల్లపు అన్నపూర్ణ


దాడి పార్వతి


గంగాభవాని


షణ్ముఖ కుమార్


రాపేటి శిల్ప


దాడి విజయ్


దాడి శివాజీ


బొడ్డేటి రఘురాం


కాళ్ళ శివరామకృష్ణ


ఎం.రాజు

(కోరుకొండ- ఆంధ్రజ్యోతి)

పల్లెటూరులో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే గొప్ప.. అటువంటిది ఒకే ఊరులో ఏకంగా పది మంది ఒకే తరహా ఉద్యోగం సాధిస్తే ఎలా ఉం టుంది.. ఆశ్చర్యమే కదూ.. అది కూడా అన్నీ మం చి ర్యాంకులే అయితే ఆ ఊరు పేరు మారుమ్రోగిపోతోంది.ప్రస్తుతం కోరుకొండ మండలం శ్రీరంగ పట్నం పేరు అలాగే మారుమ్రోగిపోతోంది. ప్రభు త్వం ఉమ్మడి జిల్లాకు సంబంధించి 1271 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 10 పోస్టుల్లో ఆ ఊరు వాళ్లే పాగా వసేశారు. ప్రభు త్వ పాఠశాలలో చదివినా పట్టుదలతో చదివి పది మంది మా..స్టార్లుగా మారిపోయారు. పది మం దికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామం కళలకు పుట్టిల్లు. ఇక్కడ ప్రతి ఇంట్లోను ఒక కళాకారుడు ఉంటాడు. అలాంటి గ్రామం నుంచి ఓ అరుదైన రికార్డు. ఇటీవల జరిగిన మెగా డీఎస్సీలో ఈ గ్రామం నుంచి 10 మంది ఉపాధ్యాయులు ఎంపికై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్నారు.వీరిలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. మరో ఐదుగురు ఒకటి, అర మార్కులతో ఉపాధ్యాయ పోస్టులకు దూరమయ్యారు. లేదంటే ఆ సంఖ్య 15 మందికి చేరేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో గ్రామానికి చెందిన దాడి పార్వతి 17వ ర్యాంకు సాధించింది.గణితంలో సిల్లర శెట్టి గంగాభవాని 16వ ర్యాంకు కైవసం చేసుకుంది. ఎస్జీటీ బొడ్డేటి వీర వెంకట రఘురాం 24వ ర్యాంకు సాధించగా రాపాటి శిల్ప 35వ ర్యాంక్ సాధించా రు. ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఇప్పటికే ఈ గ్రామం నుంచి సుమారు 15 మంది ఉపాధ్యాయులుగా ఉన్నారు. అంటే మొత్తం ఆ గ్రామంలో 25 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

డీఎస్సీలో 10 మంది ఎంపికవడం ఆనందంగా ఉంది..



మెగా డీఎస్సీకి ముందు శ్రీరంగపట్నం గ్రాడ్యుయేట్స్ అనే వాట్సప్‌ను క్రియేట్ చేశా.. దీని ద్వారా ఎప్పటికప్పుడు డీఎస్సీ మెటీరియల్, జీకే, నోటిఫికేషన్స్, విద్యా సంబంధ సమాచారం గ్రూపులో పోస్టు చేసి డీఎస్సీ రాసే వారిని ప్రోత్సహించేవాడిని.ఈ డీఎస్సీలో 10 మంది ఒకేసారి ఎంపికయ్యారు. మా గ్రామంలో 25 మంది మాస్టార్లు ఉండడం ఆనందంగా ఉంది. - **తనకాల వెంకటభగవాన్, ఉపాధ్యాయుడు, శ్రీరంగపట్నం**

చిత్రం.. భళారే!





కపిలేశ్వరపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులా మజాకానా..ఒకసారి చూశారా పట్టేస్తారు.. చేతికి పనిచెప్పేస్తారు.. అచ్చుగుద్దినట్టు దింపేస్తారు..ఈ చిత్రంలో చూశారా..అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు బుధవారం డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాన్ని చిత్రీకరించారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులతో ఏం చేయిద్దామా అని ఉపాధ్యా యుడు ఆలోచించాడు. చిన్నారుల చేతులకు పనికల్పించాలని ఒక ఆలోచన చేశారు. ఒకసారి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటాన్ని చూపించి మీకు నచ్చిన వస్తువుపై అచ్చుంగా ఈ ముఖం రావాలని చిత్రకళ ఉపాధ్యాయుడు డి. వెంకటేష్ సూచించారు. అంతే విద్యార్థినులు బి.నందిని, ఎస్.సత్యశ్రీ, సీహెచ్ . లావణ్య రంగంలోకి దిగారు. కోడిగుడ్డు పెంకు, ఆవాలు, రావిఆకులపై డా. రాధాకృష్ణన్ చిత్రాన్ని చిత్రీకరించారు.ఆ చిత్రాన్ని చూసిన హెచ్ఎం, ఉపాధ్యా య సిబ్బంది ఆశ్చర్యపోయారు. వెంటనే విద్యార్థినులను అభినందించారు.




అరగంటలో సమస్యను ఇలా పరిష్కరించారు..

అర గంటలో రోడ్డేశారు!

అధికారులు తలచుకుంటే ఏ పనైనా ఎంత సేపు.. సమస్య ఉందని అనుకోవాలే కానీ ఆగమేగాలపై చేసేస్తారు.. సమస్యను పరిష్కరించేస్తారు.. ఈ సంఘటనే అందుకు ఉదాహరణ. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ రోడ్‌లో జడ్జి బంగ్లా వద్ద ఒక రోడ్డు ప్రమాదకరంగా మారింది.. ఆ రోడ్డును గమనించకపోవడంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు.. ఈ విషయం అధికారులు గుర్తించారు.. వెంటనే సమస్యను పరిష్కరించాలని తలంచారు. అనుకున్నదే తడవుగా అటు ట్రాఫిక్ పోలీసులు.. ఇటు మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది మంగళవారం ఆ పని దగ్గరుండి చేయించారు. కేవలం గంటలోనే రోడ్డును ఇలా సాఫీగా చేసేశారు.. ఇది గమనించిన ఆ ప్రాంతవాసులు ఆశ్చర్యపోయారు. అయ్యా అధికారులు పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్లపై ఇదే విధంగా దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.. - **ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం**

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

రాజరాజేశ్వరికి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు



రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మం డలం శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల మండపేట మండలం ద్వారపూడి ఉన్నత పాఠశాలకు బదిలీ అయిన బత్తిన రాజరాజేశ్వరికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు దక్కింది. 2001లో సోషల్ టీచర్‌గా ఉపా ధ్యాయ వృత్తిలో ప్రవేశించిన రాజరాజేశ్వరి ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం గా పనిచేశారు. అనంతరం 2019లో శాటిలైట్‌సిటీలో హెచ్ఎంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 2021 జనవరి 26న అప్పటి ఉమ్మడిజిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి చేతుల మీదుగా బెస్ట్ పెర్ఫా ర్మెన్స్ అవార్డు అందుకున్నారు. 2021 ఆగస్టు 16న సీఎం జగన్ చేతుల మీదుగా నాడు నేడు ఫేజ్-1లో బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. 2024 సెప్టెంబరు 5న కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ఇటీవల మండపేట మండలం ద్వారపూడి బదిలీపై వెళ్లారు. ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని అమరావతిలో అవార్డు అందుకోనున్నారు. అవార్డురావడం తనకు మరింత బాధ్యత పెరిగిందని రాజరాజేశ్వరి తెలిపారు.

వినూత్నంగా మంగారాణి పాఠ్యాంశాల బోధన



రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ లాలాచెరువు ఎంపీఎల్ పాఠశాల ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం లాలాచెరువు పాఠశాల ఎస్ఏ మ్యాథ్స్ ఉపాధ్యాయురాలు మోటూరి మంగారాణి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు కైవసం చేసుకోవడంపట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే మంగారాణి పాఠ్యాంశాలు బోధనలో వినూత్న పంథాలో వెళుతున్నారు. గతంలో బొమ్మలను తయారుచేసి వాటిని ఉదాహరణగా చూపిస్తూ పాఠశాలు చెప్పేవారు. అటుపై వీడియోల ద్వారా పాఠాలు అటుపై మంగారాణి యూట్యూబ్ పాఠశాల పేరుతో అద్భుతంగా బోధనలుచేసి ప్రశంసలు అందుకున్నారు. రెండువేల యూ ట్యూబ్ వీడియోలను తయారుచేసి మన్ననలు పొందారు. వీటన్నింటి నేపథ్యంలోనే ఈ అవార్డు లభించిందని మంగారాణి చెప్పారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా దుర్గాప్రసాద్



కొత్తపేట,సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం అవిడి గ్రా మ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఉ పాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆలేటి దుర్గాప్రసాద్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవా ర్డుకు ఎంపికయ్యారు ఈమేరకు ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. 40 సంవత్సరాలు వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు దుర్గాప్ర సాద్ తెలిపారు. ఈ అవార్డు రావడంపట్ల తోటి ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

కేపీపురం ఆంగ్ల ఉపాధ్యాయుడికి అవార్డు


బి.ప్రవీణ్ కుమార్

తొండంగి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్త పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బొబ్బాది ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డు దక్కించుకున్నారు. రామచంద్రపురంలో పుట్టిన ఆయన 2002 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా గొల్లప్రోలు మండలం ఏపీ మల్లవరంలో మొదటిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన యు.కొత్తపల్లి మండలంలోని పలు పాఠశాలల్లోను తొండంగి మండలం తలపంటి పేటలోను పని చేశారు. 2023లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ప్రమోషన్ పొంది ప్రస్తుతం పెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2023లో ఆయన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయనకు అవార్డు రవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు చాట్రాతి సత్యనారాయణ, ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి అభినందనలు తెలిపారు.

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెచ్ఎం గాయత్రి...



సర్పవరంజంక్షన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): కాకినాడరూరల్ ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ హెడ్మాస్టర్ కె.గాయత్రికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన 2025 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి గాయత్రిని ఎంపిక చేశారు. తొలిసారిగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం అప్లికేషన్ చేయకుం డా, ప్రభుత్వం లీప్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల ప్రతిభా పాటవాలను గుర్తించి ఈఅవార్డుకు ఎంపిక చేసింది. 30ఏళ్లుగా అనేక స్థాయిల్లో విద్యార్థులను ఉత్తమ విజేతలుగా తయారు చేయడం, పాఠశాల అభివృద్ధి పథంలో నడపటం వంటి కారణాలతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

తెలుగు అధ్యాపకుడు వీరరాఘవరావు..



అనపర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం కుతుకులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న నక్కిన వీరరాఘవరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగుభాషపై ఉన్న మక్కువతో ఆయన విద్యాభ్యాసంలోనే కాకుండా అనేక అవార్డులు, రివార్డులు సాధించారు. 16సంవత్సరాలుగా అధ్యాపకుడిగా ఎందరినో తీర్చిదిద్దిన ఆయన వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డులలో స్థానం సాధించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా, పాఠ్య పుస్తక రచయితగా, రాష్ట్ర విద్యాబోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా ఆయన పనిచేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వీరరాఘవరావును అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ(బుజ్జి), వైస్ ఎంపీపీ పులగం బులిరెడ్డి, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డి అభినందించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రభావతి



అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలోని సఖినేటిపల్లిలంక గంటి మోహన్‌చంద్రబాలయోగి జిల్లాపరిషత్ పాఠశాలలో స్కూలు అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈమేరకు ఆమెకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రభావతి 2001 డీఎస్సీ ద్వారా ఎంపిక చే సిన 2002 జనవరి 21న రావులపాలెం మండలంలోని ఈతకోట జిల్లాపరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ విధులు ప్రారంభించారు. సఖినేటిపల్లి మండలంలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల ఏపీ ఎన్సీసీ స్టేట్ మోనటరింగ్ ఆఫీసర్‌గా కూడా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ప్రభావతిని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.

7వ తేదీన భీమేశ్వరాలయం మూసివేత

ద్రాక్షారామ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఈనెల 7న సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని మూసివేయనున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ తెలిపారు. 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నివేదన అనంతరం ఆలయం మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ,పూజాధికాలు అనంతరం ఉయదం 7.30 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతి ఇస్తామని తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

ఘనంగా గణపతి హోమం

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దుండి గణపతి సన్నిధిలో బుధవారం గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణపతి హోమం ఆలయ అర్చకులు, వేదపండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణదారులు శాస్త్రోక్తంగా చేశారు. ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి

- 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి బుధవారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 8,52,934 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుంది. ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం 10.80 అడుగులుగా నమోదైంది.

పర్యవేక్షణ ఏదీ?

- ఎన్‌హెచ్ పనుల్లో అధికారుల తీరుపై మంత్రి జనార్దనరెడ్డి అసంతృప్తి


దివాన్‌చెరువు వద్ద రహదారి పనులు పరిశీలిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి

0దివాన్‌చెరువు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి (ఎన్‌హెచ్) అభివృద్ధి పనులు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులో టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీవోటీ) పద్ధతిలో ఓ ప్రైవేట్ సంస్థ చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యవేక్షణలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. రహదారి అభివృద్ధిలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యతను మంత్రి స్వయంగా చూశారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీపడవద్దన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గడువు మేరకు వేగవంతంగా పనులు పూర్తిచేయాలని, పటిష్ఠ రోడ్ల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు.

సత్యదేవుడి భక్తులకు రక్షణగా రూ 2.50 కోట్లతో షెడ్డు నిర్మాణం

- భూమిపూజ చేసిన దాత లారెస్ కంపెనీ ఎండీ కృష్ణంరాజు


పశ్చిమ రాజగోపురం వద్ద షెడ్డు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దాత కృష్ణంరాజు

అన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి దర్శనానికి వచ్చే భక్తులకు పశ్చిమ రాజగోపురం వద్ద ఎండా, వానల నుంచి రక్షణగా టెన్‌షెట్ షెడ్డు నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. విశాఖపట్నంనకు చెందిన లారెస్ కంపెనీ అధినేత కృష్ణంరాజు దీనిని నిర్మిస్తున్నారు. దీని నిర్మాణంకోసం 2023లో అప్పటి ఈవో ఆజాద్ రూపకల్పనచేసి 30 వీఐపీ సత్రాన్ని తొలగించారు. కొన్ని సాంకేతిక కారణాలతో నిర్మాణం వాయిదా పడడంతో ఖాళీప్రదేశంగా దానిని ఉంచేశారు. తిరిగి ప్రస్తుత ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లు మరోసారి దాతను సంప్రదించి అడ్డంకులను తొలగించారు. 120 అడుగులు పొడవు, 80 అడుగులు వెడల్పుతో దీనిని నిర్మిస్తుండగా సుమారు రూ. 2.50 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ భూమిపూజలో దాత దంపతులతో పాటుగా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ఈఈ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

భర్త మరణాన్ని తట్టుకోలేక బలవన్మరణం

- పురుగుల మందు తాగి రెండేళ్ల కుమారుడుకి పట్టించిన తల్లి
- కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. అతడు లేని జీవితాన్ని ఊహించలేకపోయింది. రెండేళ్ల కుమారుడ్ని ఏ విధంగా పెంచి పెద్ద చేయాలో ఎంతో ఆలోచించింది.. చివరకు జీవితంపై విరక్తితో పురుగుల మందు కలిపిన సోడా తాగి తర్వాత కుమారుడితో తాగించి ఆత్మహత్యకు పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురైన తల్లి, కుమారుడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం ఇద్దరు మృతిచెందారు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా సర్పవరం శివారు గాంధీకాలనీలో జరిగింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురం గాంధీకాలనీకి చెందిన జనపల్లి గోపి, ఆకాంక్ష (25) భార్యాభర్తలు. వారికి రెండేళ్ల కుమారుడు సార్విక్ ఉన్నాడు. భర్త మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసేవాడు. కుమారుడి పుట్టిన రోజు వేడుక కోసం రూ.3 లక్షల అప్పులు చేశాడు. అవి తీర్చలేక, ఒత్తిడి తట్టుకోలేక జూలై 22న పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నాడు. భర్త చనిపోయిన దగ్గర నుంచి ఆకాంక్ష రోదిస్తూ తమ భవిష్యత్తుపై కలత చెంది మానసికంగా కుంగిపోయింది. అత్త, పుట్టింట్లో తలో పది రోజులు ఉండేది. ఇటీవలే పుట్టింటి నుంచి అత్తమామలు నివాసం ఉండే గాంధీ కాలనీకి వచ్చింది. భర్తను తలచుకుంటూ జీవితంపై విరక్తితో గతనెల 31న మధ్యాహ్నం 3 గంటల సమయంలో సోడాలో పురుగుల మందు కలిపి ముందు తాను తాగిన తర్వాత కుమారుడికి పట్టించింది. ఇద్దరూ తీవ్ర అస్వస్థతకు గురై పడి ఉండటాన్ని గమనించిన అత్తమామలు వెంటనే చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతోన్న తల్లి, కుమారురుడు ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి డోనం శాంతికుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆదేశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. మృతదేహాలకు పోస్టు మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. కుమారుడు, కోడలు, మనవడు సుమారు 45 రోజుల వ్యవధిలో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


భర్త గోపితో భార్య ఆకాంక్ష, కుమారుడు (ఫైల్ ఫొటో)

తల్లిదండ్రులు మందలించారని బాలిక ఆత్మహత్య

శంఖవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటర్ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అన్నవరం అదనపు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కనిగిరి వరలక్ష్మీ అపర్ణ (16) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ చదువుతుంది. అయితే మంగళవారం రాత్రి తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఉరివేసుకుంది. బుధవారం అదనపు ఎస్‌ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేశారు.

దివ్యాంగ బాలికపై వృద్ధుడి అత్యాచారం

మామిడికుదురు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల దివ్యాంగ బాలికపై అదే గ్రామానికి చెందిన 70 ఏళ్లు పైబడిన వృద్ధుడు అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు పరువు పోతుందన్న కారణంతో ఈ విషయాన్ని రహస్యంగా ఉంచారు. బాలిక గర్భం దాల్చడంతో గర్భస్రావం చేయించారు. ఈ సంఘటన 3 రోజులు క్రితం గ్రామంలో ఆ నోటా ఈ నోటా గుప్పుమనడంతో గ్రామ పెద్దలు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. గ్రామంలోని పెద్దలు సమావేశమై బాధిత బాలిక కుటుంబ సభ్యులకు రూ.లక్షల్లో డబ్బు చెల్లించేలా ఒప్పందం కుదిరిందని గ్రామంలో చర్చించుకుంటున్నారు. దీనిపై తమకు ఏ ఫిర్యాదు అందలేదని నగరం పోలీసులు తెలిపారు.

చేబ్రోలులో డెంగ్యూ జాడలు

పెరుగుతున్న జ్వర బాధితులు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో డెంగ్యూ జాడలు కనిపిస్తున్నాయి. గ్రామంలో పలువురు వైరల్ ఫీవర్లతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రవేటు ఆసుపత్రులకు వస్తున్నారు. కొద్దిరోజులుగా ఈ పరిస్థితి ఉండగా, 2రోజులుగా మరింత తీవ్రమైంది. ఈబీసీ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలుడికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు. బాలుడికి సాధారణ జ్వరమేనని వైద్యులు తెలిపారు. పీహెచ్‌సీని రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసేన నాయకులు సందర్శించి జ్వర పీడితులకు అందుతున్న వైద్యసేవలపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రతన్‌తో మాట్లాడారు.

కొడుకు చేతిలో తండ్రి హతం

మందులు తీసుకురమ్మని డబ్బిస్తే మద్యం తాగడంతో ఘాతుకం

కరప, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. మందులు తీసుకురమ్మని డబ్బిస్తే వాటితో ఫూటుగా మద్యం తాగి రావడంతో కోపోద్రిక్తుడైన కొడుకు తండ్రిని గొడ్డలితో విచక్షణారహితంగా నరికి హతమార్చాడు. కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ హత్యోదంతానికి సంబంధించి స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పలంక శివారు మొండి గ్రామంలో నివాసముంటున్న కాలాడి సూర్యచంద్రరావు(50)కు నలుగురు కుమారులున్నారు. అతడి భార్య క్యాన్సర్‌తో బాధపడుతూ మూడేళ్ల క్రితం చనిపోయింది. సూర్యచంద్రరావు సముద్రంలో వేటకు వెళుతూ వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ కుటుంబాన్ని పట్టించుకోవడం మానేశాడు. సూర్యచంద్రరావు మూడో కుమారుడు మహేష్ ఫిట్స్ వ్యాధి, మానసిక రుగ్మతతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. సోదరుడికి మందులు తీసుకురమ్మని రెండో కుమారుడు చంద్రశేఖర్ తండ్రికి రూ.500 ఇచ్చి పంపించాడు. అయితే ఆ డబ్బులతో ఫూటుగా మద్యం తాగి వచ్చిన తండ్రి తో కొడుకు చంద్రశేఖర్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో పట్టలేని కోపంతో తండ్రిపై గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. తండ్రి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కరప ఎస్‌ఐ తోట సునీత సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి పెద్ద కుమారుడు ధనుంజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ కేసు నమోదు చేశారు.


సూర్యచంద్రరావు మృతదేహం

రైతులను ఆదుకోని ప్రభుత్వం

వారికి మద్దతుగా వైసీపీ ఉద్యమం : శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స

కాకినాడ, సెప్టెంబరు 3, (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వారికి యూరియా కూడా సరిగా అందజేయలేకపోతోందని, రైతులు బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని వైసీపీ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన కాకినాడలోని వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇబ్బంది పడేది రైతేనని, కూటమి ప్రభుత్వంలో అన్నదాతల పరిస్థితి చాలా దారుణంగా తయారైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్పా, చేతల్లో ఎక్కడా కనిపించడంలేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే అయితే అనావృష్టి, లేకుంటే అతివృష్టి అని ధ్వజమెతారు. రాష్ట్రంలో రైతులు యూరియా కోసం అగచాట్లు పడుతున్నారన్నారు. వారికి మద్దతుగా ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో కార్యాలయాల వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపి, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని, ఎంతోమంది ప్రాణత్యాగాల ప్రతిఫలమని, దీని కోసం పెద్ద ఎత్తున వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు. శ్రీకాకుళం నుంచి తూర్పుగోదావరి జిల్లా వరకు అన్ని నియోజకవర్గాల ప్రజామద్దతు నిరసన ఉద్యమం చేపట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. గత నెల 30న కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులు విశాఖలో ఉన్నా కనీసం విశాఖ ఉక్కుపై నోరెత్తలేదన్నారు. ఎన్నికల ముందు 21 మంది ఎంపీలు ఉన్నారు.. మీరు ఉప్పుకారం తింటున్నారా లేదా? అంటూ తెగ ఊగిపోతూ వైసీపీని విమర్శించిన పవన్‌కల్యాణ్ నేడు అధికారంలో ఉండి ఏం చేస్తున్నారని బొత్స ప్రశ్నించారు. నాటి పౌరుషం ఏమైందని, ఉప్పు కారం మీరు తినడం మానేశారా? అంటూ పవన్‌పై ధ్వజమెత్తారు. దీనిపై మీ కార్యాచరణ ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 18 సార్లు ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు విశాఖ ఉక్కుపై అక్కడి పెద్దలపై ఏం మాట్లాడారో వెల్లడించాలని బొత్స పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.రెండు లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చిందని, అది నిజమో! కాదో! చెప్పాలని డిమాండ్ చేశారు. సుగాలి ప్రీతి హత్య కేసుపై తమ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి, సీబీఐకి అప్పగించిందన్నారు. ఇలాంటి విషయంలో మాట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సీఎం చంద్రబాబు అన్నట్టుగానే అసెంబ్లీలో తేల్చుకుంటామని ఆయన వెల్లడించారు. అధికార పక్షం నుంచి కూటమి, ప్రతిపక్షంగా వైసీపీ రెండు తేల్చుకుందాం రండి అని పిలుపునిచ్చారు.


కాకినాడలో మాట్లాడుతున్న బొత్స

జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య ఎంవోయూ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్శిటీ, అనుబంధ కళాశాలల్లో ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ ఇనీషియేటివ్‌ను అమలుచేసేందుకు వీసీ సమావేశ హాల్లో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ ఏ.కృష్ణమోహన్ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో జేఎన్టీయూకే, నాస్కామ్ మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్ సమక్షంలో జేఎన్టీయూకే, నాస్కామ్ అధికారులు సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వృత్తి నైపుణ్యాలు, హ్యాకథాన్లు, పరిశ్రమ నాయకత్వ సెషన్లలో కోర్సులను ఉచితంగా అందిస్తారన్నారు. విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈఎంవోయూ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాస్కామ్ ప్రతినిధులు ఉదయ్‌శంకర్, ప్రవీణ్‌కుమార్ రెక్టార్, ఓఎస్డీ, పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.


వీసీ ప్రసాద్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

చీటీల పేరుతో రూ.2.39 కోట్లు మోసం

పిఠాపురంలో ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చీటీల పేరుతో ఖాతాదారులను కోట్లల్లో మోసం చేసిన ఇద్దరు నిందితులను పిఠాపురం పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలో 2014లో సత్యశివానీ చిట్‌ఫండ్ కంపెనీని కొర్రా సత్యనారాయణ, పక్కుర్తి వరహాలరావు, లోకారెడ్డి భాస్కరరావులను డైరెక్టర్లుగా ప్రారంభించారు. రూ.5 లక్షలు నుంచి రూ.20లక్షల వరకూ చీటీలు వేశారు. 2023లో చీటీలు పాడుకున్న ఖాతాదారులకు సొమ్ములు చెల్లించకపోవడంతో సుమారు 94మంది అసిస్టెంట్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ అనంతరం ఖాతాదారులను మోసం చేసినట్లు వెల్లడి కావడంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సునంత పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యశివానీ చిట్‌ఫండ్స్ రికార్డులు, ఖాతాదారులు వివరాలు, ఇతర ఆధారాలను పిఠాపురం సీఐ ఆధ్వర్యంలో పరిశీలించారు. 94మంది ఖాతాదారులకు సంబంధించి రూ.2.39 కోట్లను చెల్లించకుండా చిట్‌ఫండ్ కంపెనీ డైరెక్టర్లు పక్కదోవపట్టించి సొంత అవసరాలకు వినియోగించినట్లు విచారణలో వెల్లడైంది. విచారణ అనంతరం కంపెనీ డైరెక్టర్లు పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన కొర్రా సత్యనారాయణరావు, గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన లోకారెడ్డి భాస్కరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో మరికొందర్ని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

8న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో వివిధ కంపెనీల్లో ఉన్న అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయడానికి కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న ఉదయం 8గంటలకు ఐటీఐ ఫైనల్ ఎగ్జామ్స్ రాసిన, పాసైన విద్యార్థులకు ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్ మేళా 2025 నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాల్ వర్మ తెలిపారు. ప్రముఖ పరిశ్రమల నుంచి మేనేజ్‌మెంట్ స్టాఫ్ వచ్చి అప్రెంటిస్ ట్రైనీస్‌ను ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడ్స్‌లో ట్రైనింగ్ కంప్లీట్ చేసి ఎన్‌టిసి సర్టిఫికెట్ కలిగిన విద్యార్థులు ఒరిజినల్స్‌తో హాజరుకావాలని, 9440408182లో సంప్రదించాలని కోరారు.

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా స్మరణ్ రాజ్

- ప్రస్తుత పీవోకి పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం



రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ నూతన పీవోగా 2022 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి బచ్చు స్మరణ్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత పీవో కట్టా సింహాచలానికి పోస్టింగ్ ఇవ్వలేదు. ఈయన తెలుగువాడు కావడం విశేషం. తెలంగాణలోని సిద్దిపేట జిల్లాకు చెందినవాడు. హైదరాబాద్ విద్యానగర్‌లో ఉంటూ ఉన్నత విద్యను అభ్యసించారు. తండ్రి రమేష్ కుమార్ హైదరాబాద్‌లో న్యాయవాది వృత్తిలో ఉన్నారు. 2021లో సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి 676వ ర్యాంకు సాధించి 2022 బ్యాచ్ ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. తొలుత అనకాపల్లి అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ పొందారు. అనంతరం మార్కాపురం, నూజివీడు సబ్ కలెక్టరుగా పనిచేశారు. నూజివీడు నుంచి ఇటీవలే బదిలీ అయ్యి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. స్మరణ్ రాజ్ ఐఐటీ మద్రాస్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చేశారు. 2017లో బ్రెయిన్ హెమరేజ్ సమస్యతో బాధపడిన తర్వాత రికవరీ అయ్యి ఐఏఎస్ సాధించారు.

లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్ వ్యాన్

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
- దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో ఘటన
- బాధితులంతా శ్రీకాకుళం వాసులే .. పోలీసు కేసు నమోదు

దేవరపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన దేవరపల్లి మండలం కృష్ణపాలెం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన జీరు అసిరినాయుడు, లక్ష్మీదంపతుల కుమారుడు లక్ష్మణరావు (నాని) 28 సంవత్సరాలు నెల్లూరులో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈవెంట్ కోసం తన డ్యాన్స్ బృందం 11 మందితో కలిసి టాటామ్యాజిక్ వ్యాన్‌లో బయల్దేరాడు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం ఫ్లైఓవర్ దగ్గరకు వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీని మ్యాజిక్ వ్యాన్ వెనుక నుంచి ఢీకొనడంతో డ్యాన్స్ మాస్టర్ లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. 10 ఏళ్ల నుంచి లక్ష్మణరావు ఎంఎండీఎస్ పేరుతో డ్యాన్స్ బృందాన్ని నడుపుతున్నాడు. స్వల్ప గాయాలైన శ్రావణ్, ఖరీష్మ, హరిను హుటాహుటిన 108 వాహనంలో గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, మృతదేహాన్ని గోపాలపురం ఆరోగ్యకేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.




మృతుడు జీరు లక్ష్మణరావు (ఫైల్)

ప్రమాదానికి గురైన టాటామ్యాజిక్ వ్యాన్

తెలికిచర్లలో అశ్లీల నృత్యాలు

- ఆలస్యంగా వెలుగులోకి
- తమ దృష్టికి రాలేదన్న సీఐ బాలశౌరి

నల్లజర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం తెలికిచర్లలో ఆదివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా జరిగిన ఊరేగింపులో మహిళలతో రికార్డింగ్ డ్యాన్స్ వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాక్టర్‌పై మహిళలు అశ్లీలంగా వేసిన నృత్యాలను కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో బంధిస్తూ సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్ అయ్యింది. తెలికిచర్ల, కొత్తపేటలో రెండు చోట్లా రికార్డింగ్ డ్యాన్స్ జరగడంతో మండలంలో సంచలనమయ్యింది. మొన్న ఘంటవారిగూడెంలో జరిగిన సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడంతో మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నల్లజర్ల సీఐ బాలశౌరిని వివరణ కోరగా, తమ దృష్టికి రాలేదని, విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



రికార్డింగ్ డ్యాన్స్ వేస్తున్న దృశ్యం (ఫైల్)

అంతర్వేదిలో వైభవంగా పవిత్రోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన స్వామి,అమ్మవార్లు


పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో మూడో రోజు బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి-అమ్మవార్లను పురాతన కల్యాణ మండపం వద్ద ప్రత్యేక సింహాసనంపై కొలువుదీర్చి అలంకరించారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో పంచసూక్తాలతో వేద మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. సర్వ దైవత్య హోమం, మహాశాంతి హోమం, పంచ సూక్తాలతో హోమం, మూల హోమం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర నామార్చన మొదలగు విశేష పూజలుచేశారు. పవిత్రోత్సవాల్లో ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాలరాజా బహదూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమసిన వివాదం

- గిరిజన విద్యార్థి మృతి కేసులో కలెక్టర్ జోక్యం
- మృతుని కుటుంబానికి పరిహారం, ఉద్యోగ కల్పన హామీతో ఆందోళన విరమణ


రంపచోడవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి వివేకానందరెడ్డి మృతిలో గత మూడురోజులుగా ఐటీడీఏ అధికారుల తీరుపై కుటుంబసభ్యులు చేపట్టిన ఆందోళన బుధవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ జోక్యంతో విరమించారు. విద్యార్థి మృతిపై చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం నుంచి బంధువులు, ఆదివాసీ నాయకులు కలిసి ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. కాగా పెద్ద దిక్కుగా ఉన్న ఐటీడీఏ పీవో వచ్చి న్యాయం చేస్తామని చెప్పి భరోసా కల్పించాలని బాధితులు కోరగా, ఆయన రాకపోవడంతో గొడవ ఉధృతమైంది. ఫలితంగా మూడురోజులుగా విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం జరగలేదు. ఎట్టకేలకు కలెక్టర్ రంగంలోకి దిగి ఐటీడీఏ, గిరిజన సంక్షేమ అధికారులకు ఆదేశాలిచ్చి, మృతుడి కుటుంబానికి ఉద్యోగ కల్పనపై అధికారులు, ఆశ్రమ పాఠశాల సిబ్బంది లిఖిత పూర్వక హామీతో పాటు రూ.1.50 లక్షల తక్షణ పరిహారం అందజేయడంతో ఆందోళనను విరమించారు. అలాగే ఐటీడీఏ తరఫున గిరిజన సంక్షేమ డీడీ రుక్మాంగదయ్య ఆందోళనకారులతో చర్చించారు. దీంతో కలెక్టర్‌కు మృతుడి కుటుంబీకులు గిరిజన నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, వెదుళ్ల లచ్చిరెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. మూడోరోజు ఆందోళనలో నాయకులు మట్ల వాణిశ్రీ, పల్లాల అనసూయ, సాదల చిలకమ్మ, బాలు అక్కిన, మద్దేటి అంజిరెడ్డి, కత్రం రామదాసు దొర, గొర్లె ప్రణీత్, ఐవీ రమణ, ఈక నరసన్నదొర పాల్గొన్నారు.


రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గుమిగూడి ఉన్న ఆందోళనకారులు

భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి

- ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు

అయినవిల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భాద్రపద ఏకాదశి, వినాయక ఉత్సవాలు సందర్భంగా బుధవారం అయినవిల్లిలో సిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష దూర్వార్చన, మాడవీధిసేవ, ప్రత్యేకాలంకరణ చేశారు. క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ సహాయ కమిషనర్ అల్లు దుర్గాభవానీ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. బుధవారం పంచామృతాభిషేకాలు 6, లఘున్యాస అభిషేకాలు 260, ప్రత్యేక దర్శనం 804, శ్రీలక్ష్మీగణపతి హోమం 58, నామకరణం 1, అక్షరాభ్యాసాలు 8, తులాభారం 15, ద్విచక్ర వాహన పూజలు 24, కొబ్బరికాయల మొక్కుబడి 20, పులిహోర 3481, లడ్డూ 4420, అన్నప్రసాదం 5,900, అన్నప్రసాద విరాళం రూ.2,46,046, విరాళాల ద్వారా రూ. 2,591, మొత్తం ఆదాయం రూ. 5,57,853 వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ దుర్గాభవాని తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

ట్రాక్టర్ ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

అమలాపురం రూరల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కామనగరువు కిమ్స్ ఆసుపత్రి సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైక్లిస్టు అక్కడికక్కడే మృతిచెందినట్టు అమలాపురం పట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో భట్నవిల్లి వైపు నుంచి అమలాపురం వైపు ట్రాక్టరు, మోటారు సైకిల్ ఒకే మార్గంలో వెళుతున్నాయి. అయితే ట్రాక్టర్ వెనుకభాగం మోటారు సైక్లిస్టుకు తగలడంతో భట్నవిల్లికి చెందిన వడ్రంగి మేస్త్రి గోడ పణికుమార్ (32) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చీరల పంపిణీ

కరప, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జడ్.బావారం గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. జనసేన నాయకులు శాకా వంశీ, గుణ్ణం శ్రీనివాస్, బుంగా బాబి, డి.గంగాధర్, కరెడ్ల లోవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడల్లో పాల్గొనే సభ్యులకు సహకారం అందించాలి

కలెక్టర్‌ను కోరిన ఆ శాఖ ప్రతినిధులు


కలెక్టర్‌కు కరపత్రం ఇస్తున్న త్రినాథ్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవంబరు 7 నుంచి 9 వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర రెవెన్యూ క్రీడల్లో పాల్గొనే కాకినాడ జిల్లా సభ్యులకు సహకారం అందించాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పి.త్రినాథ్ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. కాకినాడ కలెక్టరేట్లో బుధవారం ఆయన కలెక్టర్‌కు కరపత్రం ఇచ్చారు. రెవెన్యూ క్రీడల్లో పాల్గొనడానికి రెవెన్యూ ఉద్యోగులకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ప్రాక్టీసు చేసుకోవడానికి కొంత సమయం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఈ నేపథ్యంలో ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహన్, ప్రతినిధులు సంధ్య, ఇతర రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.

దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి : జేసీ


సామర్లకోట తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా

సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తహశీల్దార్ కార్యాలయానికి కుల, నివాస, ఆదాయ తదితర ధృవీకరణపత్రాల జారీకి వచ్చే దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహులమీనా వీఆర్వోలను ఆదేశించారు. సామర్లకోట తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం జేసీ సందర్శించారు. కార్యాలయంలో వివిధ ధృవీకరణ పత్రాల జారీ చేస్తున్న తీరును ఇళ్లస్థలాల దరఖాస్తుల నమోదులతో పాటు పలు రిజిష్టర్లను పరిశీలించారు. పట్టాదారు పాసు పుస్తకాల జారీకి ప్రభుత్వ నిబంధనలను ప్రతీ వీఆర్వో తెలుసుకోవాలన్నారు. మండలంలో రేషన్ డీలర్ల ద్వారా సరఫరా అవుతున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా పంపిణీ అయ్యేలా వీఆర్వోలు పరిశీలించాలన్నారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డీటీలు వై. శ్రీనివాసు, పద్మజ, వీఆర్వోలు రాంజీ, నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు, రాంజీ, పద్మనాభం, ఆదిబాబు, జయమ్మ, కెవీవీ సత్యనారాయణ, మామిడాల కామరాజు ఉన్నారు.

'ప్రజల ఆరోగ్య అవసరాలకు అండగా సీఎం'


పిఠాపురంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య అవసరాలకు ఎంత మొత్తంలోనైనా నిధులు వెచ్చించేందుకు సీఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురానికి చెందిన మోగంటి సావిత్రి, ఇమ్మిడిశెట్టి రేవతి, అందుగుల బేబీలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం వారి ఇళ్లకు వెళ్లి వర్మ అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సతీష్, కొరుప్రోలు శ్రీనివాసరావు, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను, అందుగుల సత్తిబాబు, ఇమ్మిడిశెట్టి సోనాబాబు, శివాల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు గణేష్ నిమజ్జనోత్సవ ఆహ్వానం


కమిషనర్ భావనకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర గణేశ ఉత్సవ సమితి బృంద సభ్యులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, చిట్నీడి శ్రీనివాస్, దువ్వూరి సుబ్రహ్మణ్యం, కొక్కిలిగడ్డ గంగరాజు, సరిపల్ల శ్రీరామచంద్రమూర్తి బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావనను కలిసి నిమజ్జనోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానపత్రం అందజేశారు. స్థానిక వారఫ్ రోడ్డులోని వినాయక సాగర ప్రాంగణంలో నిమజ్జనం సందర్భంగా ఎదురవుతున్న ఆటంకాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కమిషనర్ నిమజ్జనం జరిగే చోట ఇబ్బందిగా ఉన్న బోర్డును తొలగించి నిమజ్జనోత్సవానికి అవసరమైన క్రేన్‌ను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీనిపై ఉత్సవ సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీ శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా భీమాబత్తుల


భీమాబత్తుల సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ పెనుమర్తికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు భీమాబత్తుల సత్యనారాయణను ఏపీ శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన టీడీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతున్నారు. శాలివాహన సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు. డైరెక్టర్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు, మంత్రి లోకేశ్, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కటకంశెట్టి బాబీ, పిల్లి సత్యనారాయణమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం కమిటీల్లో అవకాశం కల్పించాలి

శ్రీపాదశ్రీవల్లభ ఫౌండర్స్ సేవా ట్రస్టు ప్రతినిధుల డిమాండ్

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం కమిటీల్లో అవకాశం కల్పించాలని శ్రీపాదశ్రీవల్లభ ఫౌండర్స్ సేవా ట్రస్టు ప్రతినిధులు డిమాండ్ చేశారు. పిఠాపురంలోని మహాసంస్థానం సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ శ్రీపాదుల వారు నడయాడిన ప్రాంతంలో 1982లో ఫౌండర్స్ అయిన ఆర్యవైశ్యులు, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఆలయాన్ని నిర్మించినట్టు తెలిపారు. మహాసంస్థానం పీఠాధిపతిగా ఉన్న సజ్జనగడ రామస్వామి 1989లో ఆలయాన్ని పునర్నించారని చెప్పారు. ఆలయ అభివృద్ధికి ఫౌండర్స్, వారి కుటుంబసభ్యులు ఎనలేని కృషి చేశారని తెలిపారు. భక్తులకు మరింత మెరుగుగా సేవలందించేందుకు తమ ట్రస్ట్ కృషి చేస్తుందని చెప్పారు. ఎన్నికలకు ముందు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మహాసంస్థానం ధర్మకర్తల మండలిలో ఆర్యవైశ్యులకు స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన హామీకి అనుగుణంగా ట్రస్ట్ సభ్యులు మండలిల్లో స్థానం కోసం దరఖాస్తు చేశామని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా, సభ్యులుగా తమకు అవకాశం కల్పించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పాటు టీడీపీ, బీజేపీ నాయకులను కలుస్తామని చెప్పారు. సమావేశంలో శ్రీపాదశ్రీవల్లభ ఫౌండర్స్ సేవా ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఫైండా శ్రీరామమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమించి కామేశ్వరరావు, కార్యదర్శి ఫైండా సత్యరామన్న, కోశాధికారి కప్పల భాగ్యలక్ష్మి, ట్రస్టు సభ్యులు నాళం అనసూయ, బోడ మురళీకృష్ణ, కోట సత్యధర్మరాజు, పెనుగొండ కొండలరావు, సాలగ్రామ పాపయ్యశాస్త్రి, ఫైండా రమాదేవి, మల్యాల సత్యనారాయణ ఉన్నారు.


పిఠాపురంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఫౌండర్స్ సేవా ట్రస్టు ప్రతినిధులు

స్మార్ట్‌కార్డులతో బహుళ ప్రయోజనాలు

కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, సివిల్ సప్లైస్ చైర్మన్ సుధీర్


పిఠాపురంలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీ, సుధీర్, తుమ్మల, దొరబాబు, మర్రెడ్డి

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా సరుకులు తీసుకునేందుకు అందిస్తున్న స్మార్ట్‌కార్డుల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ తెలిపారు. పిఠాపురం రథాలపేట సెంటర్‌లో గల అంబేద్కర్ కమ్యూనిటీహాలులో బుధవారం సాయంత్రం డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి కొండలరావుతో కలిసి వారు రేషన్‌కార్డుదారులకు స్మార్ట్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చౌకధరల దుకాణాలు అన్ని రోజుల్లో తెరిచి ఉంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. బియ్యం, పంచదారతో పాటు మరిన్ని నిత్యావసర వస్తువులు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికి కొత్త కార్డులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పిఠాపురం తహశీల్దారు పీవీ గోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీకి వచ్చిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించగా, ఎంపీ తదితరులు వస్తున్నారని అధికారులు తెలిపారు. కొంత సమయం ఎదురు చూసి రాకపోవడంతో తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయంటూ వర్మ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అక్రమాలకు అడ్డుకట్ట : తుమ్మల

పెద్దాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు స్మార్ట్ రేషన్ కార్డులతో అడ్డుకట్ట పడనుందని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో స్మార్ట్ రైస్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం ఈస్మార్ట్ కార్డులను జారీ చేయడం జరుగుతున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేకూర్చేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. స్మార్ట్‌కార్డు వల్ల పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకత తీసుకురానున్నట్లు చెప్పారు. తుమ్మల నాని, కూటమి నేతలు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతోనే సత్ఫలితాలు

ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీతారామశర్మ, రైతులకు ఎలుకల మందు పంపిణీ


కరప: కొంగోడులో రైతులకు ఎలుకల మందు అందిస్తున్న సీతారామశర్మ, ఏడీఏ బాబూరావు

కరప, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితేనే సత్ఫలితాలను సాధించగలమని ఏరువాక కేంద్రం పెద్దాపురం ప్రధాన శాస్త్రవేత్త పి.సీతారామశర్మ తెలిపారు. కరప మండలం కొంగోడులో బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సీజన్‌లో ఎలుకల వల్ల దిగుబడిలో 10-20 శాతం నష్టం వాటిల్లుతుందన్నారు. విత్తిన నాటి నుంచి వెన్నువేసే వరకు అన్ని దశల్లో ఎలుకల వల్ల తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. వీటిని సమూలంగా నిర్మూలించి పంటను కాపాడుకోవాలని సూచించారు. రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. సర్పంచ్ నక్కా బాబులు, ఏడీఏ కె.బాబూరావు, ఏవో ఇమ్మిడిశెట్టి సత్య, ఉపసర్పంచ్ వనుం నారాయణరావు, ఏఈవోలు ఎంవీ సతీష్,బండారు శ్రీరాములు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఎలుకల నివారణ సామూహికంగా చేపట్టాలని ఏడీఏ నల్లి దైవకుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. విషపు ఎరను ఏవిధంగా తయారుచేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్, ఏఈవో ప్రసాద్, నూనే రామారావు, నల్లల శ్రీను, రైతులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): ఎలుకల నిర్మూలనకు సరఫరా చేసిన బ్రోమోడయోలిన్ మందుల పంపిణీ అన్ని రైతు సేవా కేంద్రాల్లో పూర్తి చేశామని సామర్లకోట ఎంఏవో మురళీధర్ వెల్లడించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిచే రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించి ఈ మందులను పంపిణీ చేసినట్లు ఎంఏవో తెలిపారు. ఏఈవో శాంతికమల, రూప, రైతులు కొప్పిరెడ్డి వీరాస్వామి, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా అందజేసి వరి పొలాల్లోని ఎలుకల బొరియల్లో పెట్టించారు. కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు నష్టం లేకుండా సాయం అందించాలి'


సామర్లకోట మండల పరిషత్ సమావేశ దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న పంటసాయాలను అందుకునేందుకు రైతులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ బి.సత్తిబాబు, నవర పీఏసీఎస్ అధ్యక్షులు తోట వెంకటేశ్వరరావు వ్యవసాయాధికారి మురళీధర్‌ను కోరారు. సామర్లకోట మండల పరిషత్ సమావేశం బుధవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ ప్రగతి తీరును ఎంఏవో వివరిస్తుండగా పంట సాగులో ఈ-పంట నమోదులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నందున రైతులు నష్టపోతున్నారని ఆందోళన చెందారు. ప్రభుత్వం బీమా పథకాలు అమలుచేస్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు, వ్యవసాయసిబ్బంది నిర్లక్ష్యం చేయడాన్ని ఎంపీపీ సత్తిబాబు తప్పుబట్టారు. మండలంలో కౌలురైతులకు ఎంతగానో ఉపయోగపడే సీసీఆర్‌సీ కార్డుల జారీలో కూడా వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలువురు కౌలు రైతులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారన్నారు. నిర్ణీత సమయంలో సీసీఆర్‌సీ కార్డుల జారీ, ఈ-పంట నమోదులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఏవో మురళీధర్‌ను ఎంపీపీ సత్తిబాబు ఆదేశించారు. పనసపాడులో స్మార్ట్ కార్డుల జారీకి రేషన్ డీలర్లు ఒక ప్రత్యేక దరఖాస్తు కోరుతున్నారని అది ప్రైవేట్ జెరాక్స్ దుకాణాల్లో రూ.10 వరకూ విక్రయిస్తున్నందున ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఎంపీటీసీ శ్రీను వాపోయారు. దీనిపై తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కార్డు లబ్ధిదారుడి నుంచి కేవలం సంతకం తీసుకుని స్మార్ట్ కార్డులు జారీ చేయాలని తాము ఆదేశించామన్నారు. ప్రత్యేక దరఖాస్తు కోరుతున్న అంశం ఇప్పుడే తన దృష్టికి వచ్చినందున తక్షణం దర్యాప్తు జరిపి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ స్పష్టంచేశారు. ఎంపీడీవో కరక హిమమహేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ పద్మజ, ఎంఈవో వై. శివరామకృష్ణయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కాకినాడలో సరస్వతీ పూజలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ దుగ్గిరాల వారి వీధిలో గల శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం గణపతి హోమపూజలు నిర్వహించారు. 200 మంది విద్యార్థులతో సరస్వతీ పూజా కార్యక్రమాన్ని వేదమంత్రోచ్చారణల మధ్య చేపట్టారు. దుర్గాసోము ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోము రాజ్‌కుమార్, స్వాతి దంపతులు విద్యార్థులకు అవసరమైన పూజాద్రవ్యములు, సరస్వతీ చిత్రపటాన్ని, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను ఉచితంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నల్లూరి శ్రీనివాసు, బెజవాడ బాబీ, మండవల్లి వెంకన్న బాబు, నల్లమిల్లి వెంకటరెడ్డి, అమలకంటి సూర్యప్రకాష్, చిల్లా రమణారెడ్డి, వరదా సుబ్బారావు, వెన్నపు రామగోవిందు, సున్న ఈశ్వర రావు, చీకట్ల వాసు, సుందరనీడి తరుణ్, నల్లూరి తులసి, మండవిల్లి శ్రీదేవి, వెన్నపు కుమారి పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి వ్రతాలు

పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో గల శ్రీపాదవల్లభ అనఘాదత్త క్షేత్రంలో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అన్నవరం దేవస్థానం వేదపండితులు భక్తులతో ఈ వ్రతాన్ని చేయించారు. వ్రతం విశిష్టతను వివరించారు. దత్తక్షేత్రంలో చాతుర్మాస్య దీక్షలో ఉన్న మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామిజీ వ్రత పూజల్లో పాల్గొని భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఈ వ్రతానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. భక్తులు మనస్సు నిశ్చలంగా ఉండి పూజలు చేస్తే ఫలితాలు అందుకోగలుగుతారన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి
జైలు, జరిమానా

కాకినాడ క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 21 మందికి కాకినాడ 5వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్‌కె షరీన్ జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1 అండ్ 2 సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతూ 21 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఒకరికి 5 రోజుల జైలు శిక్ష, మరో 8 మందికి ఒక్కొక్కరికి 2 రోజుల చొప్పున జైలు శిక్ష, 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

జైగణేష్‌స్వామికి అరటిపళ్ల అలంకరణ



పిఠాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో వేంచేసి ఉన్న జైగణేష్ దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామికి పంచహస్తకళ అరటిపళ్ల అలంకారం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి.

ఎంపీ కార్యాలయంలో లలిత సహస్రపారాయణ


లలిత సహస్రపారాయణ చేస్తున్న మహిళలు

సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడీబీ రోడ్డు కొప్పవరంలోని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో బుధవారం నీలాద్రి భజన మండలి ఆధ్వర్యంలో లలిత సహస్రపారాయణ పూజలను మహిళలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రసాదవితరణ చేశారు. అనంతరం మహిళలకు ఎంపీ సానా సతీష్‌బాబు సౌజన్యంతో తాంబూలసత్కారాలు మేకా లక్ష్మణమూర్తి నిర్వహించారు. కోటిపల్లి సతీష్, చింతపల్లి అర్జున్, ముత్యాల అనిల్, సంగాడి బంగారురాజు, బర్ల శ్రీనివాసు, బండి నరేంద్ర, కాకరపల్లి చలపతిరావు, అంకమరెడ్డి రామానాయుడు, ఐటీడీపీ సతీష్ పాల్గొన్నారు.

'ప్రశాంతంగా గణపతి విగ్రహాల నిమజ్జనాలు'


మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గణపతి విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఇందుకు ఉత్సవకమిటీ ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి సూచించారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారంలో పలు ఉత్సవకమిటీ నిర్వాహకులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామర్లకోట పట్టణ పరిధిలో అన్ని గణపతి విగ్రహాలు గోదావరి పుష్కరిణి వద్దకు తీసుకురావాలన్నారు. అలాగే మండల పరిధిలో కూడా పెదబ్రహ్మదేవం, జీ.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, ఉండూరు, వీకె. రాయపురం, మాధవపట్నం గ్రామాల వెంబడి గోదావరి పుష్కరిణిల వద్ద విగ్రహాల నిమజ్జనోత్సవాలు నిర్వహించాలని సూచించారు. సదస్సులో సీఐ కృష్ణభగవాన్, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీవిద్య, డీటీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి అక్షరాస్యత కల్పించడమే లక్ష్యం

డీఎల్‌డీవో వాసుదేవరావు


కొత్తపల్లిలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

కొత్తపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో వయోజనులను పూర్తిస్థాయిలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్యోద్దేశ్యమని కాకినాడ డీఎల్‌డీవో పడాల వాసుదేవరావు అన్నారు. కొత్తపల్లి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశమందిరంలో బుధవారం ఎన్ఆర్‌జీఎస్, ఐకేపీ సిబ్బందికి ఉల్లాస్ (అక్షర ఆంధ్ర) కార్యక్రమంలో భాగంగా వయోజనులకు అక్షరాశ్యత కల్పించడంపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. మండలంలో వయోజనులను అక్షరాశ్యులుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటుచేసిన వలంటర్లు ఒక్కరు 10మంది వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎన్ఆర్‌జీఎస్, ఐకేపీలకు చెందిన ప్రతినిధులను వలంటర్లుగా ఏర్పాటుచేసి బ్యాచ్‌లను సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎంపీడీవో కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, అడల్ట్‌ఎడ్యుకేషన్ డిడీ పుసుపులేటి పోసయ్య, ఏపీడీ పి వసంతమాధవి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో గొన్నాబత్తుల కొండలరావు, ఐకేపీ ఎపీఎం కె.తవుడు, ట్రైనర్ పోలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

హాకీలో విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో పి.రమేష్, డీసీఈబీ వెంకట్రావు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ స్పోర్ట్సు అథారిటీ నిర్వహించిన రాష్ట్ర హాకీ చాంపియన్‌షిప్‌లో కాకినాడ జిల్లా మహిళాహాకీ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. జట్టులో కాకినాడ సాలిపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సంధ్య, సలోమి ప్రతిభ కనబరచి విజయానికి కృషిచేసారు. వారిని బుధవారం డీఈవో పి.రమేష్, డీసీఈబీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఏసీఈ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయిని పుష్పగిరి, పీడీలు మేరీ, రమా, రాజేశ్వరి అభినందించారు.

తైక్వాండోలో...


సిల్వర్ మెడల్స్ సాధించిన లహరిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాకినాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో మాంట్‌ఫోర్ట్ ఇండోర్ స్టేడియంలో గతనెల 30, 31న జరిగిన 20వ సౌత్ తైక్వాండో ఐటీఎఫ్ చాంపియన్ షిప్ పోటీల్లో కాకినాడ శ్రీనగర్ మున్సిపల్ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న టి.లహరి రెండో స్థానంలో నిలిచింది. సిల్వర్ మెడల్స్‌ను కైవసం చేసుకుంది. తైక్వాండో ఆర్గనైజేషన్ ఆఫ్ తమిళనాడు నిర్వహించిన పోటీల్లో రన్నరప్‌గా నిలవడంపై స్కూల్ హెచ్ఎం ఎం. సత్యకుమారి, ఫిజికల్ డైరెక్టర్ కె.మౌనీ, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.గోవిందరావు, ఉపాధ్యాయులు సాయిబాబా తదితరులుఅభినందించారు.

సామర్లకోట విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా లోవరాజు

సామర్లకోట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ అర్బన్ లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా చిట్టూరి లోవరాజును నియమిస్తూ విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయం నుంచి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సామర్లకోటలో లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్‌ను పలు అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా జూలై 18న విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచీ సామర్లకోట అర్బన్‌కు లైన్‌మెన్, లైన్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులలో ఎవరినీ నియమించలేదు. బుధవారం తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ఆదేశాల మేరకు లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న లోవరాజుకు పదోన్నతిపై లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా సామర్లకోట అర్బన్‌కు నియమించారు. ఇదే రీతిలో సామర్లకోట విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో లైన్‌మెన్‌లుగా పనిచేస్తున్న పెదబొంతు బాలకృష్ణను కందరాడ సెక్షన్‌కు, మేకా వెంకట రమణను యూ.కొత్తపల్లి సెక్షన్‌కు, పి.రాముసుబ్రహ్మణ్యంను దివిలి సెక్షన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేత్రదానంపై ర్యాలీ

పెద్దాపురం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవ అవగాహన ర్యాలీని సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సీహెచ్‌సీ నుంచి గుర్రాల సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగింది. మానవహారంగా ఏర్పడి నేత్రదానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీవిద్య, మానస, శ్రీనివాస్, సిబ్బంది రమాదేవి పాల్గొన్నారు.

శాకంబరి అవతారంలో లక్ష్మీగణపతిస్వామి

కిర్లంపూడి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రమణయ్యపేటలోని శ్రీలక్ష్మీగణపతి బుధవారం భక్తులకు శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కుమ్మరివీధిలో గణనాధుడిని జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, భక్తులు తదితరులు దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

సూపర్ సిక్స్.. సూపర్ హిట్: ఎమ్మెల్యే శిరీష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాజవొమ్మంగి సెప్టెంబర్ 3(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా అమలు జరుతున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. బుధవారం రాజవొమ్మంగిలో స్త్రీ శక్తి సూపర్ సిక్స్‌సూపర్ హిట్ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శిరీష దేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా టీడీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా కూటమిప్రభుత్వంలో అర్హులందరికీ ప్రతి సంక్షేమ పథకం అందుతుందన్నారు. మహిళా లబ్ధిదారులు మాట్లాడుతూ గతంలో తమ పిల్లల్లో ఒక్కరికే అమ్మఒడి డబ్బులు పడేవని, కాని కూటమి ప్రభుత్వంలో ఇంటిలో ఉన్న పిల్లలందరికీ డబ్బులు పడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో అన్ని పథకాలు అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. అనంతరం రాజవొమ్మంగి గ్రామంలో టీడీపీ నేతలు, మహిళలు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ లోతా లక్ష్మణరావు, సొసైటీ మాజీ అధ్య క్షుడు గణజాల తాతారావు, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు, టీడీపీ నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్, బీజేపీ నాయకురాలు స్వప్నకుమారి పాల్గొన్నారు.

యూరియా కోసం బారులుతీరిన రైతులు



చింతూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) యూరియా అందుబాటులోకి రావడంతో రైతులు బారులు తీరారు. చింతూరు రైతు సేవాకేంద్రానికి బుధవారం పది మెట్రిక్ టన్నులు యూరియా, ఏడు మెట్రిక్‌టన్నుల డీఏపీ, చదలవాడ రైతు సేవా కేంద్రానికి పది మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. బుధవారం చింతూరు రైతు సేవాకేంద్రం వద్ద యూరియా, డీఏపీ విక్ర యించారు. దీంతో రైతులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున గుమికూడి పోటీ పడ్డారు. ఒక దశలో రైతులను అదుపుచేయలేని పరిస్థితి చోటుచేసుకుంది. దీంతో వ్యవసాయాధికారులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ పి.రమేష్ సిబ్బందితో రైతు సేవా కేంద్రం వద్దకు చేరుకుని రైతులను నియం త్రించి క్రమపద్ధతిలో రైతులకు యూరియా అందేలా చర్యలు చేపట్టారు. చిం తూరు మండలంలో 11రైతు సేవా కేంద్రాలున్నాయి, ఆయా కేంద్రాలకు ఒక్కొంటికి 20నుంచి 25మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టామని వ్యవసాయాధికారిణి రత్నప్రభ ఆంధ్రజ్యోతికి తెలిపారు. 2రోజుల్లో ఏడుగు రాళ్ళపల్లి తదితర రైతు సేవాకేంద్రాలకు యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు.

లక్కవరంలో యూరియా విక్రయం

మోతుగూడెం, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం చదలవాడ పంచాయతీ లక్కవరం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం చదలవాడ, వాలమూరు, గొంది, లక్కవరం, తులసి పాక, లక్కగుడెం, గొడ్లగూడెం, సిరసనపల్లి, కనుసులూరు, చౌలూరు, గమలకోట, ఎర్రగొండ, పాకల, ఏరువాడ గ్రామాల రైతులకు 225బస్తాలు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కుంజా తిరుపతిరావు, మండల వ్యవసాయాధికారిణి రత్నప్రభ, వ్యవసాయ సిబ్బంది, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. యూరియా సకాలంలో పంపిణీ చేసినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా అవసరాలు తీర్చేదే 'ఆదికర్మయోగి'

వై.రామవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల అవసరాలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకే మోదీ ప్రభుత్వం ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు కడబాల ఆదివిష్ణు అన్నారు. బుధవారం కోట పంచాయతీ బుల్లోజిపాలెంలో నిర్వహించిన ఆదికర్మయోగి ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సిబ్బంది, ఆయన గ్రామంలో పర్యటించి ప్రజల అవసరాలను గుర్తించారు.

ఘనంగా గణపతి నిమజ్జనాలు

దేవీపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శరభవరం, గండికోట, నేలకోట, బియ్యంపల్లి తదితర గ్రామాల్లో గణనాధుల నిమజ్జనం బుధవారం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో పూజలందుకున్న గణనాథులను బుధవారం భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువు, కాల్వల్లో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితుల ర్యాలీ

కూనవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 15రోజుల నుంచి జలదిగ్బంధంలో ఉన్నామని, ఇళ్లు మునిగిపోయ్యాయని, కానీ వరద సాయం ఇవ్వలేదని కూనవరం శివాలయం వీధి ప్రజలు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ వరద సమీక్షా సమావేశాల్లో ముందస్తు చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు గాని అవి ఏమీ నెరవేరలేదన్నారు. బఫర్ స్టాక్ నిత్యావసర వస్తువులు ఏర్పాటు చేయలేదన్నారు. తక్షణమే ముంపునకు గురైన ఇళ్లకు ఆర్థిక సాయం అందజేయాలన్నారు. సీపీఎం నాయకులు తెలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాస్, తెల్లం తమ్మయ్య, కొండా ఈశ్వర్ పాల్గొన్నారు.

నాటు పడవలపై సంతకు

చింతూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదుల ఉధృతి దోబూచులాటగా మారింది. బుధవారం ఉదయం ఏడు గంటలకు భద్రాచలంలో గోదావరి 39.50అడుగుల మేర ప్రవహించగా సాయంత్రం ఏడు గంటలకు 42.10 అడుగులకు చేరుకుంది. చింతూరు వద్ద శబరి బుధవారం కొద్దిగా తగ్గి 29.50అడుగులకు చేరుకుంది. కాగా భద్రాచలం వద్ద గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో ఆ ప్రభావం శబరి నదిపై పడనుంది. మన రాష్ట్రం మీదుగా ఒడిస్సాకు వెళ్లే 326 జాతీయ రహదారిపై నిమ్మలగూడెం, కుయుగూరుల నడుమ వాగు వంతెనపై వరద తగ్గడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్నారు. సోకిలేరు, చీకటివాగులపై ఉన్న వంతెనలపై ఇంకా వరద నీరు తగ్గక పోవడంతో నాటు పడవలపై ప్రయాణాలు చేస్తున్నారు. బుధవారం చింతూరు వారాంతపు సంతకు ఏజీ కొడేరు, ముకునూరు, పెద్దసీతనపల్లి, రామన్నపాలెం గ్రామ పంచాయతీలకు చెందిన వరద బాధితులు నాటు పడవలపై చింతూరు వచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేసుకున్నారు. పదహారు రోజులుగా వరద తగ్గక పోవడంతో లోతట్టు ప్రాంతాల్లో వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి



రంపచోడవరం, సెప్టెంబరు3 (ఆంధ్ర జ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు బుధవారం అమరావతి సెక్రటేరియట్‌లో కలిశారు. ఏజెన్సీ గ్రామాల్లో అటవీ అభ్యంతారాలతో నిలిచిపోయిన రహదారులకు అనుమతులు మంజూరు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు.



కిర్లంపూడి మండలంలో ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువుల షాపుల్లో అధికారుల తనిఖీలు

కిర్లంపూడి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిర్లంపూడి, బూరుగుపూడి, సోమవరం, గెద్దనాపల్లి గ్రామాల్లో ఎరువుల షాపులను బుధవారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల స్టాకులో వ్యత్యాసం రాలేదని ఎరువుల డీలర్లు ఎమ్మార్పీకి ఎరువులను విక్రయించాలన్నారు. బ్లాక్ మార్కెట్, అనధికారికంగా ఎరువులు నిల్వ చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ.గోపాలకృష్ణ, విజిలెన్స్ తహసీల్దార్ కె.విజయకుమారి తెలిపారు. వారి వెంట ఏవో నాగ సుధామాధురి, వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్ ఉన్నారు.



యర్రవరం కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు, తల్లిదండ్రులు

యర్రవరంలో విద్యార్థినుల ఆందోళన

నర్సింగ్ కళాశాల చైర్మన్ తీరుపై ఆగ్రహం

ఏలేశ్వరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ శిక్షణ పేరుతో కొత్త యర్రవరం ఝాన్సీరాణి నర్సింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థినులను విజయవాడ తీసుకువెళ్లి తమ పిల్లలతో వెట్టిచాకిరీ చేయించారని తల్లిదండ్రులు బుధవారం ఆరోపించారు. యర్రవరంలోని నర్సింగ్ కళాశాల వద్దకు పలువురు తల్లిదండ్రులు, విద్యార్థినులు చేరుకున్నారు. తమ పిల్లలకు నర్సింగ్ కళాశాలలో లక్షల ఫీజులు కట్టి చేర్పించామన్నారు. చదువు చెప్పకుండా ఇతర కళాశాలలకు తీసుకువెళ్లి కంప్యూటర్‌లో శిక్షణ పేరుతో విజయవాడ ప్రైవేటు కళాశాల వసతిగృహంలో వంట పనులు, బట్టలు ఉతకడం తదితర పనులకు ఉపయోగించారని తల్లిదండ్రులు ఆరోపించారు. వాహనాలు శుభ్రం చేయడం, కూరగాయలు తరగడం, శానిటేషన్, వంట గదులు శుభ్రం చేయడం తదితర పనులను తమతో చేయించేవారని పలువురు బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కళాశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు సాయం

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామానికి చెందిన గొంపు రాజు, అల్లి కృష్ణ ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారిని జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి నిత్యావసర సరుకులు అందించి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నీలాద్రిరావుపేట జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కత్తిపూడిలో రంగవల్లులు వేస్తున్న మహిళలు

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు

శంఖవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి కొత్తూరులో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని రోజుకొక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బుధవారం నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతగా చంటిబాబు మాస్టారు వ్యవహరించగా మొదట ముగ్గురి విజేతలకు స్థానిక నేతలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేట బీసీ కాలనీ, చల్లపల్లివారి వీధిలో ఆయా గణపతి మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి బుధవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ముందుగా గణనాధుడిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట పలువురు జనసైనికులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి) మండల వ్యవసాయాధికారి జోకా అమృత ఆధ్వర్యంలో మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఎలుకల నిర్మూలన మందు ఏవిధంగా తయారుచేయాలో రైతులకు వ్యవసాయ సిబ్బంది వివరించారు. పెద్దిపాలెంలో ఏవో అమృత పొలాలను సందర్శించి ఎలుకల నిర్మూలన మందు తయారీ విధానం ప్రయోగాత్మకంగా వివరించారు. ఎలుకల మందు చిన్నచిన్న పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో పెట్టాలన్నారు. అనంతరం ఎలుకల మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఆర్.వీర అర్జున, ఉద్యాన అధికారి జలజ పాల్గొన్నారు.

'వృద్ధుడిపై కేసు అక్రమం'

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసుతో అసభ్యంగా ప్రవర్తించారంటూ 86ఏళ్ల వృద్ధుడు ముదునూరి రామరాజుపై అక్రమ కేసు పెట్టారని వైసీపీ నాయకుడు, నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీశివ కుమారి, ప్రతిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ ఆరోపించారు. ధర్మవరంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎంపీడీవో కుమార్‌బాబు అధికార పార్టీ అండదండలతో అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు.

బవురువాక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బవురువాక గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ మహిళలు బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు వినతిపత్రం అందజేశారు. గ్రామ మాజీ ఎంపీటీసీ పట్టిం అప్పారావు, గ్రామ పెద్ద నందా అప్పారావు ఆధ్వర్యంలో గిరిజన మహిళలు పెదశంకర్లపూడి తరలివచ్చి ఎమ్మెల్యేకు సమస్యలు ఏకరువు పెట్టారు. దీనిపై ఎమ్మెల్యే సత్యప్రభ అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

సంపద కేంద్రాల మెరుగుతో సంపద సృష్టించాలి

పంచాయతీరాజ్ జిల్లా సీఈవో



గండేపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ జిల్లా సీఈవో లక్ష్మణరావు

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తను సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించి కేంద్రాలను మెరుగు పరచాలని పంచాయతీరాజ్ జిల్లా సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఆయన గండేపల్లిలో ఉన్న సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ వాహనాల ద్వారా ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పారిశుధ్య నివారణకు చర్యలు తీసు కోవాలన్నారు. గండేపల్లి సంపద కేంద్రాన్ని పరిశీలించి దీన్ని నిర్వహిస్తున్న కార్యదర్శి ఫణీంద్ర కుమార్‌ను అభినందించి ప్రతీ గ్రామంలో ఈ విధంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.చంద్రరావు, గండేపల్లి కార్యదర్శి ఫణీంద్రకుమార్, ఈసీ రమేష్, సిబ్బంది ఉన్నారు.

సామూహికంగా ఎలుకల నివారణ చేపట్టాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భద్రవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల నేతృత్వంలో సామూహిక ఎలుకల నిర్మూలన నిర్వహించారు. ఈ సందర్భంగా వీఏఏ దాడిశెట్టి భువనేశ్వరి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల కొరత లేకుండా చూస్తున్నామని తుని మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఆయా పంచాయతీల్లో ఎలుకల నివారణ మందు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో కేజీ చంద్రశేఖర్, ఏఈవో జగ్గ అప్పారావు, సురేష్, శివాజీ, నాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): ఎలుకల నివారణను సామూహికంగా చేపట్టాలని వ్యవసాయ అధికారి పి.గాంధీ పేర్కొన్నారు. గురువారం కత్తిపూడిలో రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన చేపట్టి ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా నివారణ చేపట్టాలి

రౌతులపూడి, (ఆంధ్రజ్యోతి): రైతులంతా తప్పనిసరిగా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు రైతులకు సూచించారు. బలరామపురంలో రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ పైల సీత అధ్యక్షతన సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణ మందును సొసైటీ అధ్యక్షుడు పైల పైడిరాజు అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారుల సమక్షంలో ఎలుకల నివారణ కార్యక్రమాన్ని జరిపారు.

6న చలో విజయవాడను విజయవంతం చేయండి

అన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లలిత, పేరూరి సుబ్రహ్మణ్యం, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కోటనందూరు,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా రేషన్‌ను పక్కదారి పట్టకుండా చేయవచ్చునని తుని మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, లోవదేవస్థానం మాజీ ఛైర్మన్ గాడి రాజుబాబు అన్నారు. బుధవారం కోటనందూరులో కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిత్యావసర వస్తువులను ఇందులో ఇచ్చేందుకు చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు పెంటకోట భాస్కర సత్యనారాయణ, డీ.చిరంజీవిరాజు, వెలగా వెంకటకృష్ణారావు, లగుడు సత్యనారాయణమూర్తి, తహశీల్ధార్ పీవీవీ సత్యనారాయణ, సత్యరాయణ, భవాని, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తున్న దృశ్యం



కాకినాడలో క్రిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్‌ను సందర్శించిన ఆదిత్య విద్యార్థులు

ఆదిత్య సీఎస్ఈ విద్యార్థులు పారిశ్రామిక సందర్శన

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థులు కాకినాడలోని క్రిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ పరిశ్రమలో అనుసరిస్తున్న తాజా సాఫ్ట్‌వేర్ సాంకేతికతలు, ఆధునిక సాధనాలు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి విధానాలపై అవగాహన పొందారు. అదే విధంగా ఐటీ సంస్థల సంస్థాగత నిర్మాణం, రియల్ టైం పని విధానాలు, అవసరమైన నైపుణ్యాలు, ఉద్యోగావకాశాలు, కెరీర్ అవకాశాలు వంటి అంశాలపై పరిశ్రమ నిపుణులు వారికి తెలిపారు.

రైతులకు పిండిని సక్రమంగా అందించాలి

రౌతులపూడి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు పిండిని సక్రమంగా అందజేయకుండా పక్కదారి మళ్లిస్తున్నారంటూ బుధవారం సచివాలయం2 వద్ద సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యకర్తలు ఆందోళన చేశారు. మండల కార్యదర్శి సామిరెడ్డి నారాయణమూర్తి అధ్వర్యంలో కార్యకర్తలు సచివాలయానికి చేరుకుని ఆందోళన చేశారు. రెండు రోజుల క్రితం పిండికి సొమ్ములు తీసుకుని రసీదు ఇచ్చి పిండి ఇవ్వలేదని తెలిపారు. దళారులకు పిండి తరలిపోతోందని ఆరోపించారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించి పిండిని అందజేయాలని కోరారు.



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్)

చిరు వ్యాపారుల కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

జ్యోతుల నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్‌గా నామకరణ



జ్యోతుల నెహ్రూ కాంప్లెక్స్ నేమ్ బోర్డుతో చిరు వ్యాపారస్తులు

జగ్గంపేట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయం పక్కన నూతనంగా నిర్మించిన చిరు వ్యాపారస్తుల షాపింగ్ కాంప్లెక్స్‌కి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్‌గా నామకరణ చేయడంతో చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆశీర్వాద్ రియల్ ఎస్టేట్ రాజు మాట్లాడుతూ 30ఏళ్లగా 25కుటుంబాలకు చెందిన చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. దొంగతనాలు, అగ్ని ప్రమాదాలు తదితర అనేక సమస్యలతో వ్యాపారం చేస్తూ ఇబ్బందులు పడేవారమని, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌లు నూతన షాపు కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి మమ్మల్ని ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో జ్యోతుల నెహ్రూ షాపింగ్ కాంప్లెక్స్ సభ్యులందరూ పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద ఇద్దరి మధ్య ఘర్షణ

బీరుబాటిల్‌తో దాడి

అన్నవరం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మద్యం దుకాణం వద్ద ఇద్దరి మధ్య ఘర్షణపై కేసు నమోదు చేసినట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమరగిరి లక్ష్మణ్, వేరే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి మద్యం సేవిస్తుండగా ఘరణ జరిగి ఫోన్ లాక్కోవడంతో మరోవ్యక్తి బీర్‌బాటిల్‌తో దాడి చేయడంతో లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ హరిబాబు తెలిపారు.

రాజేష్ జన్మదిన వేడుకలు

తొండంగి. సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ జన్మదిన వేడుకలు బుధవారం జరిగాయి. బెండపూడి శివారు సుబ్బరాయపురంలో ఆయన స్వగృహంలో ఆయన్ను కలిసిన పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రామానికి చెందిన జాలెం దుర్గాప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం క్రాంతి పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఆమె వెంట జనసైనికులు ఉలిసి అయిరాజు, మొగిలి గంగాధర్, కంచర్ల సుబ్రహ్మణ్యం, యరమల్ల రాజు తదితరులు ఉన్నారు.

ఆదిత్యలో ఐడియా స్పార్క్ 2025

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్యలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్(ఇడిసి) ఆధ్వర్యంలో ఐడియా స్పార్క్ 2025 విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బాహ్య స్టార్టప్‌లను ఒక చోట చేర్చి వారి సృజనాత్మకను ప్రదర్శించే వేదికగా నిలిచింది. కార్యక్రమంలో మొత్తం 42 స్టాల్స్ ఏర్పాటు చేయగా అందులో మూడు బాహ్య స్టార్టప్‌లు, ఆరు పూర్వ విద్యార్థుల స్టార్టప్‌లు, 31 విద్యార్థుల నేతృత్వంలోని ప్రాజెక్టులున్నాయి. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్స్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ రమాశ్రీ, డీన్స్ ఫ్యాకల్టీ సభ్యులు ప్రారంభించగా ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



ఏలేశ్వరం ప్రభుత్వ కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఐఈవో శారద

ప్రభుత్వ కళాశాలను సందర్శించిన అధికారి

ఏలేశ్వరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈవో శారద సందర్శించారు. కళాశాల తరగతి గదులు, అధ్యాపకుల విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం వంటి పలు అంశాలపై విద్యార్థులను ఆరా తీశారు. వైస్ ప్రిన్సిపాల్ బాబ్జిని నూతన అడ్మిషన్లు , రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం కళాశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నదని విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి డాక్టరేట్ పట్ల హర్షం

గండేపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల హెచ్‌బీఎస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పోతంశెట్టి రాజశేఖర్‌రెడ్డి అహ్మదాబాద్ సబర్మతి యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ అంజు దహియా నేతృత్వంలో రాజశేఖర్‌రెడ్డి సమర్పించిన ఇండియన్ సొసైటీ యాజ్ పోర్ట్రయిడ్ ఇన్ ది ఫిక్షన్ ఆఫ్ రూత్ ప్రయర్ జబ్ వాలా అంశంపై డాక్టరేట్ పొందారన్నారు. భవిష్యత్‌లో ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

గణనాథులకు పూజలు



ప్రత్తిపాడు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏర్పాటుచేసిన వినాయక మండపాల్లోని గణనాథులకు బుధవారం పూజలు నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో వినాయకుడికి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు. ప్రత్తిపాడు, ఒమ్మంగి, ఉత్తరకంచి గ్రామాల్లో పలు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ధర్మవరం జగనన్న కాలనీ వినాయక మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.